
సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
19 వ వసంతంలోకి ...
ఎన్టీఆర్ కృష్ణా
బుధవారం 24 డిసెంబర్ 2025 పేజీలు 8






## ఆంధ్రా నుంచి తెలంగాణకు

# జోరుగా ఇసుక అక్రమ రవాణా

- ఉదయం సమయంలో ఆంధ్ర ట్రాక్టర్లతో డంప్ చేసుకొని, రాత్రి సమయంలో తెలంగాణ ట్రాక్టర్లు ద్వారా సరిహద్దును దాటేస్తున్న వైనం
- అక్రమ ఇసుక రవాణాలో మండల అధికారుల పాత్ర ఎంత?
- నాయకుల అండదండలతోనే ఇసుక రవాణా జరుగుతున్నదా?

వివరాలు 7లో

## మాజేరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఇరువురు వ్యక్తులు దుర్మరణం
- రెండు కుటుంబాల్లో అంతులేని విషాదం



వివరాలు 7లో...

## 2029 నాటికి అర్హత ఉన్న

# ప్రతి పేదవాడికి సొంత ఇల్లు

- ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మెరిట్ సీట్లు లేకుండా చేసింది గత పాలకులే?
- గత ప్రభుత్వం రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసింది
- ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పై 18 నెలల కాలంలో దాదాపు రూ. 50 వేల కోట్లు ఖర్చు
- ఒక్కో ఇటుక పేర్చి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పెడుతున్నాం అర్హులైన అందరికీ అక్రడిటేషన్ అందిస్తాం
- సమచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ స్టేట్‌గా నిలబెట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా పనిచేస్తోందని సమచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మంగళవారం సమచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, గత ప్రభుత్వ వైఫల్యాల గురించి మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్ షిప్) అనేది కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు

2

# పిపిపి విధానంతోనే మెడికల్ కాలేజీలు, హాస్పటల్స్ అభివృద్ధి

- విజయవాడ ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి సీ.ఎస్.ఆర్ నిధుల కోసం కృషి
- ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల బాలికల హాస్టల్ భవనం ప్రారంభోత్సవం
- మంత్రి సత్యకుమార్ యాదవ్ తో కలిసి హాస్టల్ ను ప్రారంభించిన ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే గద్దె, కలెక్టర్ లక్ష్మీశా

వివరాలు 7లో



# 2029 నాటికి అర్హత ఉన్న ప్రతి పేదవాడికి సొంత ఇల్లు

(మొదటిపేజీ తరువాయి)

నాయుడు ప్రవేశపెట్టింది కాదని, ఇది ప్రపంచవ్యాప్తంగానే కాకుండా దేశం లోని అనేక రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న విధానంగా మంత్రి అన్నారు. మెడికల్ కాలేజీల విషయంలో పీపీపీ మోడల్‌ను విమర్శించడం సరికాదు. గత ప్రభుత్వం 17 కాలేజీలు తెచ్చామని గొప్పలు చెప్పుకుందని కానీ, కేవలం దాదాపు రూ. 600 కోట్లు ఖర్చు చేసి 8,500 కోట్ల ప్రాజెక్టును గాలికి వదిలేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన పీపీపీ విధానం వల్ల 50% సీట్లు మెరిట్ ప్రాతిపదికన కేవలం రూ. 15,500 ఫీజుతో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకే దక్కుతాయన్నారు. గత ప్రభుత్వ విధానం వల్ల కేవలం 35% సీట్లు మాత్రమే మన విద్యార్థులకు అందేవని, ఈ మార్పు వల్ల కలిగే ప్రయోజనాన్ని విపక్షం జీర్ణించుకోలేకపోతుందన్నారు. పీపీపీ టెండర్లలో పాల్గొంటే జైలుకు పంపిస్తామనే విపక్షం బెదిరింపులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మంత్రి వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రజలు వాస్తవాలను గమనించాలని కోరుతున్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసిందన్నారు. మన రాష్ట్రం ఇతర రాష్ట్రాల కంటే 32% అదనంగా అప్పులు చేసిందని స్వయంగా కాగ్ నివేదికలో స్పష్టంగా పేర్కొందన్నారు. గత ప్రభుత్వం బడ్జెట్‌కు వెలుపల, కార్పొరేషన్ల పేరుతో విచక్షణారహితంగా అప్పులు చేసిందని అన్నారు.. అప్పు తెచ్చిన నిధులను మూలధన వ్యయం కోసం కాకుండా కేవలం ఇతర ఖర్చులకే వినియోగించారని తెలిపారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాలను నిర్లక్ష్యం చేసిందన్నారు. ఏ నాగరికత అభివృద్ధి అయినా రోడ్లపై కనిపిస్తుందని అంటా రని, కానీ గత ప్రభుత్వం రోడ్ల మరమ్మత్తులను, కొత్త రోడ్ల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. డ్రైనేజీ కాలువలు, కాలువల నిర్వహణ కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, దీనివల్ల వ్యవసాయ రంగం కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. 2014-19 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు నా యుడు ప్రారంభించిన ప్రాజెక్టులను గత ప్రభుత్వం కక్షపూరితంగా నిలిపి వేసిందన్నారు. చింతలపూడి ప్రాజెక్టు 7-8 వేల కోట్లతో పూర్తి అయ్యే అవకా శం ఉన్నా అప్పటికే 4 వేల కోట్లు ఖర్చు చేసినా, కేవలం ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ప్రారంభించారనే కారణంతో నిలిపివేశారన్నారు. దీనివల్ల 2.5 లక్షల ఎకరాల సాగు నీరు, లక్షల మందికి తాగు నీరు అందకుండా పోయిం దన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా కూడా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం 18 నెలల కాలంలో దాదాపు 50 వేల కోట్లు ఖర్చు చేయడం జరిగిం దన్నారు. గత ప్రభుత్వం ఇంట్లో ఒక్కరికే చదువుకునే ఆడ పిల్లలకు ఆర్థిక సాయం అందిస్తే, కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది ఆడ పిల్లలు ఉంటే అంతమందికీ "తల్లికి వందనం" పథకాన్ని వర్తింపజేస్తోందన్నారు. రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచే స్తోందన్నారు. పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 8.29 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాయని, పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో మరో 13.5 లక్షల కోట్ల రూపాయల విలువైన ఎంవోయూ లపై సంతకాలు జరిగాయని, వీటి ద్వారా దాదాపు 20 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా వేశామన్నారు. నైపుణ్యాభివృద్ధి కేవలం చదువుకే పరి మితం కాకుండా, రాష్ట్రంలో పెట్టుబడి పెట్టే పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా యువతకు స్కిల్ (నైపుణ్యం) నేర్పించడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతగా మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమలను ఆకర్షించడానికి ప్రభుత్వం 25 బెస్ట్ పాల సీలను (స్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటి, డ్రోన్, ఇండస్ట్రియల్ పాలసీలు) ఆమో దించిందని మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా, పరిశ్రమలు పెట్టే పెట్టుబడిదారులకు ఇన్సెంటివ్స్ అందించడానికి 'ఎస్క్రో అకౌంట్' విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. పొరుగు రాష్ట్రాల మంత్రులు కూడా ఏపీకి వస్తున్న పెట్టుబడుల గురించి చర్చించే స్థాయికి రాష్ట్రం చేరుకుందంటే దానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం, పరిపాలనా దక్షత కారణంగా పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సిన అవసరం లేకుండా ఫోన్ ద్వారానే 700-800 సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పొందే సదుపాయం కల్పించామన్నారు. విపక్షాలు రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో విద్వేషాలు, ఉద్వేగాలు రెచ్చగొడుతూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని మంత్రి విమర్శించారు. ప్రజాస్వామ్యంలో అసెంబ్లీ ఒక దేవాలయం వంటిదని, అక్కడ ప్రభుత్వం ప్రజలకు సమాధానాలు చెప్పాలి, ప్రతిపక్షం ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పేర్కొన్నారు. కేవలం ప్రతిపక్ష హోదా రాలేదనే నెపంతో అసెంబ్లీకి రాకుండా ఉండటం ప్రజాస్వా మ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. జల్ జీవన్ మిషన్, అమృత్ వంటి కేంద్ర పథకాల ద్వారా ఇతర రాష్ట్రాలు లక్షల కోట్లు పొందుతుంటే, గత ప్రభుత్వం కనీసం రూ. 3 వేల కోట్లు కూడా తీసుకురాలేకపోయిందని, దీనివల్ల రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. గత ప్రభు త్వం సోలార్ కంపెనీలతో ఉన్న ఒప్పందాలను రద్దు చేయడం వల్ల రాష్ట్రంపై రూ. 9,000 కోట్ల భారం రాష్ట్రంపై పడిందన్నారు. తక్కువ ధరకు వచ్చే సోలార్ విద్యుత్‌ను కాదని, ఓపెన్ మార్కెట్‌లో రూ. 10 నుండి రూ. 14 వరకు విద్యుత్ కొనడం వల్ల ప్రజలపై భారం పడిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాబోయే ఐదేళ్లలో యూనిట్ విద్యుత్ ధరను రూ. 1.20 పైసలు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నారన్నారు. గతంలో ప్రభు త్వం వచ్చే సమయానికి యూనిట్ ధర రూ. 5.19 పైసలు ఉండగా, ప్రస్తుతా నికి అది రూ.4.80 - రూ.4.90 మధ్య ఉందని, దీనిని రూ. 4 కన్నా తక్కువ కు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. గతంలో విద్యుత్ ఉత్పత్తి పెద్ద సంస్థలకే పరిమితం కాగా, ఇప్పుడు ప్రతి పేదవాడు పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా ఇందులో భాగస్వామి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామ న్నారు. అర్హత ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ ఇళ్లపై రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బీసీలకు సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్స్ ఏర్పాటు కోసం 20% సబ్సిడీ ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. 2047 నాటికి తలసరి ఆదాయాన్ని రూ. 50 లక్షల మించి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. జీడిపి పెరుగుదలను ప్రతి సంవత్సరం మానిటర్ చేస్తూ, ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి చేయాలని నిర్ణయించారన్నారు.

**క్వాంటం కంప్యూటర్ :** ప్రపంచంలోనే అతికొద్ది దేశాలకే అందుబాటులో ఉన్న క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికతను రాష్ట్రం ద్వారా దేశానికి అందించబోతు న్నామన్నారు. దీనికి కావలసిన కాంపోనెంట్స్ తయారీ కూడా మన రాష్ట్రంలోనే జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

రహదారుల అభివృద్ధి: గతంలో రోడ్ల దుస్థితి ఏవిధంగా ఉండేదో మనందరికీ తెలిసిన విషయమేనని, గుంతల రోడ్లను బాగు చేయడా నికి, కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు.

**నీటి వనరులు, ఇతర పథకాలు:** గ్రౌండ్ వాటర్ పెంచడం, నదుల అను సంధానం ద్వారా రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగు నీటి సమస్యలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు జల్ జీవన్ మిషన్, అమృత్ వంటి వాటిని సమర్థవంతంగా అమలు చేసి రాష్ట్రానికి మేలు చేస్తామన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన శాఖలైన అటవీ, పంచాయతీ రాజ్ వంటి వాటిలో నిబద్ధతతో పని చేస్తున్నారని, పంచాయతీలకు వచ్చే నిధులు పారదర్శకంగా ఖర్చు అయ్యేలా గ్రామ సభలు నిర్వహిస్తున్నా రన్నారు. బెంగళూరులో రోడ్ల పరిస్థితిపై ఒక పారిశ్రామికవేత్త సోషల్ మీడి యాలో పెట్టిన పోస్ట్‌కు తక్షణమే స్పందించి, వారిని రాష్ట్రానికి ఆహ్వానించిన తీరు మంత్రి లోకేష్ పనివేగానికి నిదర్శనమన్నారు.

**పెట్టుబడుల ఆకర్షణ:** అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో పర్యటించి, అక్కడి దిగ్గజ సంస్థలకు రాష్ట్ర విధానాలు, మానవ వనరులు, సహజ వనరుల పట్ల నమ్మకాన్ని కలిగించారని మంత్రి అన్నారు.

**ప్రముఖ సంస్థల రాక వెనుక మంత్రి లోకేష్ కృషి**

గూగుల్, రిలయన్స్, కాగ్నిజెంట్ వంటి ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రానికి రావడంలో మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషించారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కలయికతో రాష్ట్రంలో అత్యంత బలమైన రాజకీయ శక్తి ఏర్పడిందని పెట్టుబడిదారులలో నమ్మకం కలిగించారన్నారు. తల్లీ వందనం, ఉచిత బస్సు సౌకర్యం, స్త్రీ శక్తి వంటి పథకాల ద్వారా అట్టడుగు వర్గాల ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. సామాజికాభివృద్ధి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కుటుంబాల్లోని పిల్లలకు సాఫ్ట్ వేర్ లేదా ఐటీ రంగాల్లో మంచి ఉద్యోగాలు కల్పించడం ద్వారా వారి సామాజిక గౌరవాన్ని పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నారన్నారు.

రైతు సంక్షేమం: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, పొగాకు, కోకో, మామిడి వంటి పంటలకు ప్రభుత్వం అదనపు ధర ఇచ్చి కొనుగోలు చేస్తోందన్నారు.



**వేగవంతమైన చెల్లింపులు:** ధాన్యం కొనుగోలు చేసిన 24 నుండి 48 గంటల్లోనే రైతులకు డబ్బులు చెల్లిస్తున్న ఏకైక రాష్ట్రం అని మంత్రి అన్నారు.

**రాష్ట్రంలో గృహ నిర్మాణ పథకం అమలు తీరు, ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్ ప్రణాళికలపై మంత్రి వివరిస్తూ...**

గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలను శ్మశానాలు, కొండ వాలు ప్రాంతాలు, నదులు, కాలువల సమీపంలో కేటాయించడం వల్ల ప్రజలు అక్కడ నివసించడానికి ఇష్టపడటం లేదన్నారు. అనేక కాలనీలలో కనీస సౌకర్యాలు కల్పించకుండానే ఇళ్లను ప్రారంభించడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2014-2019 మధ్య కాలంలో దాదాపు 5 నుండి 6 లక్షల కుటుంబాలకు మంజూరైన గృహాలను గత ప్రభుత్వం రాజకీయ కారణాలతో రద్దు చేసి పేదలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఇప్పటివరకు 18.5 లక్షల ఇళ్లు మంజూరు కాగా, గత ప్రభుత్వం కేవలం 6.5 లక్షల ఇళ్లను మాత్రమే పూర్తి చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో 3.2 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించిందన్నారు.. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 5.5 లక్షల ఇళ్లను 2026 జూన్-జూలై నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. పట్టణ ప్రాంతాల్లో 41,000 ఇళ్లు మంజూరు చేయగా, గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన 10 లక్షల దరఖాస్తులను పరిశీలించి అర్హులకు గృహాలను మంజూరు చేస్తామన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని మంత్రి అన్నారు.

**టిడ్కో గృహాలకు అదనపు సాయం:** కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, బీసీ, మైనారిటీలకు రూ. 50,000, ఎస్టీలకు రూ. 75,000, పీజీటీడీఎస్ వర్గాలకు రూ.1 లక్ష వరకు అదనపు ఆర్థిక సాయం అందిస్తోంద న్నారు. గృహ నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్ నుండి 40% నిధులను కేటాయిం చాలని నిర్ణయించారన్నారు. గత ప్రభుత్వం టిడ్కో లబ్ధిదారుల పేరుతో బ్యాం కుల నుండి రుణాలు తీసుకుని, ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం వల్ల లబ్ధిదారులు సిబిల్ స్కోర్ తగ్గి ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను పరిష్కరించి వచ్చే ఏడాది జూన్ నాటికి టిడ్కో ఇళ్లను పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

**మీడియా అక్రిడిటేషన్ పై ప్రభుత్వం నిర్ణయాలు**

ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయడంలో జర్నలిస్టుల, మీడియా సంస్థల బాధ్యత చాలా కీలకమని ప్రభుత్వం గుర్తిస్తోందన్నారు. గత ప్రభుత్వ కాలంలో (2019-2024) అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య 22,000 నుండి 12,000కు తగ్గించారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అక్రిడిటే షన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. సోషల్ మీడియా, యూట్యూబర్లకు కూడా అక్రిడిటేషన్ ఇచ్చే అంశంపై అధ్యయనం చేయడానికి ఒక కమిటీని వేశారన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పాలసీలను పరిశీలించి అక్రిడిటేషన్ కార్డుల సంఖ్యను పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆదేశించారన్నారు. అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి క్యాబినెట్ ఆమోదం పొంది, ఇప్పటికే జీవో విడుదలయింది.

**జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు**

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనేది చాలా కాలంగా ఉన్న డిమాండ్. 2014-2019 మధ్య కాలంలో భూ కేటాయింపులకు సంబంధించి కొన్ని జీవోలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఇతర అంశాలను పరిగ ణనలోకి తీసుకుని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంపై ము ఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా ఉన్నారని మంత్రి కొలుసు పార్థసారథి తెలియజేశారు. కార్యక్రమంలో సీఆర్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూ నాయకులు ఐవీ సుబ్బారావు, కంచల జయరాజు, సోమ సుందర్, చావా రవి, వెంకటేశ్వర్లు, దారం వెంకటే శ్వరరావు, దాసరి నాగరాజు, ఏచూరి శివ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# మచిలీపట్నంలో గోదావరి కృష్ణ కోపరేటివ్ భవిష్య 369 పథకం ప్రారంభోత్సవం

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం భవిష్య369 గోదావరి కృష్ణ కో-ఆపరేటివ్ సొసైటీ మచిలీపట్నం బ్రాంచ్ వారు సామాన్య మధ్య తరగతి కుటుంబాల కు చెందిన చిన్న పిల్లలు వారి విద్య వివాహం తదితర భవిష్యత్తు అవసరాల కోసం గోదావరి కృష్ణ భవిష్య 369 పేరుతో పొదుపు పథకాలను ప్రారంభించినట్లు గోదావరి కృష్ణ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మేడూరి జీవన్ వెంకట్రావు పేర్కొన్నారు. మంగళవారం పరాసు పేట సత్య కన్వెన్షన్ సెంటర్లో భవిష్య 369 పథకం బ్రోచర్ ను ఆవిష్కరించి పాత్రికేయులతో మాట్లాడారు. 1995 సహకార చట్టం ద్వారా ప్రారంభమైన గోదావరి కృష్ణ కోఆపరేటివ్ సొసైటీ ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఇప్పటికి 23 శాఖల ద్వారా సుమారుగా 17,000 మంది పైగా ఖాతాదారులకు సేవలం దిస్తుందని అన్నారు. ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించడంతోపాటు సామాన్య మధ్యతరగతి వర్గాలకు చెందిన చిరు వ్యాపారులకు అధిక వడ్డీల భారం నుంచి విముక్తి కల్పించి ఉజ్వల లోన్స్ ఇచ్చినట్లు చెప్పారు. బహిరంగ మార్కెట్లో కాల్ మనీ వ్యాపారుల దగ్గర ఫైనాన్స్ వ్యాపారుల దగ్గర ఎక్కువ వడ్డీకి రుణం తీసు కునే బదులు షాప్ కీపర్స్ అందరూ గోదావరి కృష్ణ కో-ఆపరేటివ్ సొసైటీ ఇస్తున్న ఉజ్వల లోన్ వల్ల ఎంతో ఆర్థిక ప్రయోజనం పొందు తునామన్న సం తృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వారి వ్యాపార నిర్వహణకు అనుగుణంగా గోదావరి కృష్ణ కోఆపరేటివ్ సొసైటీ సిబ్బంది ప్రతిరోజూ వారి వద్దకు వెళ్లి లోన్ బకాయిల వసూలు చేస్తారని చెప్పారు. నారీ సంకల్ప్ గ్రూపు రుణాలు జారీ ప్రక్రియలో భాగంగా 3000 మంది పైగా మహిళలు రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లిస్తున్నారన్నారు. వచ్చే ఆరు నెలల్లో అల్పాదాయ కుటుంబాలకు చెందిన చిన్నారులు ప్రాథమిక విద్యకు సంబంధించి అవస రమైన పొదుపు పథకాల ప్రారంభానికి సర్వే జరుపుతున్నట్లు చెప్పారు. భవిష్య 369 పథకంలో చిన్నారుల పేరుమీద లక్ష రూపాయల డిపాజిట్ చేస్తే మూడేళ్ల కాలానికి రూ.1,43,029 లు ఆరేళ్ల కాలానికి రూ.2,00,041లు, తొమ్మిది సం.రాల కాలానికి రూ.3,00,165లు వడ్డీతో చెల్లిస్తున్నట్లు చెప్పారు. కోపరే టివ్ సొసై టీలో ఖాతాదారుల సొమ్ము భద్రతకు సంబంధించిన అంశాలపై పాత్రికేయులు ప్రశ్నించగా ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించడం తోపాటు ఆ నిధులను చిన్నచిన్న మొత్తాలుగా షాప్ కీపర్స్ రుణాలు, బంగారు నగల హామీ రుణాలు ఇచ్చే కోఆపరేటివ్ సొసైటీలు డిపాజిటర్ల సొమ్ముకు జ వాబు దారిగా ఉంటా యన్నారు. 2019లో ప్రారంభించిన గోదావరి కృష్ణ కోఆ పరేటివ్ సొసై టీ 2025 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరానికి లాభాల్లోకి పైనించినట్లు చెప్పా రు. గోదావరి కృష్ణ కోపరేటివ్ సొసైటీలో షేర్ హోల్డర్లకు లాభాలను అనుస రించి డివిడెండ్ చెల్లిస్తున్నామన్నారు. గోదావరి కృష్ణ కోఆపరే టివ్ సొ సైటీ, రీ జనల్ హెడ్ శివరామకృష్ణ మచిలీపట్నం శాఖ మేనేజర్, క్లస్టర్ హెడ్ వివిఎస్ఆర్ ఆంజనేయులు, చల్లపల్లి శాఖ మేనేజర్ బుద్ధు కిషోర్ సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రామీణ బౌద్ధ వారసత్వ జాతీయ అకాడమీ కోసం..

# నాగార్జునకొండలో భూమి కేటాయించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



**విజయవాడ, డిసెంబర్ 22, మేజర్ న్యూస్ :** భారతదేశంలోని గ్రామీణ బౌద్ధ వారసత్వాన్ని పునరుద్ధరించి పరిరక్షించేందుకు చేపట్టిన ప్రయత్నాల్లో ఆంధ్రప్రదేశ్‌ను ముందంజలో నిలిపేలా గ్రామీణ బౌద్ధ వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి కోసం జాతీయ అకాడమీ స్థాపనకు నాగార్జునకొండలో ఐదెకరాల భూమిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించింది. న్యూఢిల్లీలో మూడు రోజుల పాటు జరిగిన గ్రామీణ బౌద్ధ వారసత్వ పరిరక్షణపై అంతర్జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. ఈ సదస్సులో పరిరక్షణకు జాతీయ ప్రాతిపదికగా నిలిచే ఢిల్లీ డిక్లరేషన్ను ఆమోదించారు. ఈ సదస్సుకు భారత్‌తో పాటు విదేశాల నుంచి పండితులు, బౌద్ధ భిక్షువులు, వారసత్వ పరిరక్షణ నిపుణులు, విధాన నిర్ణేతలు హాజరయ్యారు. కృష్ణా నది లోయలో ఉన్న నాగార్జున కొండ, ప్రారంభ బౌద్ధ ధర్మానికి సంబంధించిన భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన పురావస్తు స్థలాల్లో ఒకటి. ఒకప్పుడు బౌద్ధ విద్యా కేంద్రంగా, బౌద్ధ కళలకు ప్రధాన కేంద్రమైన ఈ ప్రాంతం ఇప్పటికీ అపారమైన చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను కలిగి ఉంది. ప్రతిపాదిత అకాడమీ, గ్రామీణ బౌద్ధ వారసత్వంపై పరిశోధన, శిక్షణ, సమాజ ఆధారిత పరిరక్షణకు పూర్తిగా అంకితమైన దేశంలోని తొలి సంస్థగా ఈ వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లనుంది. తక్కువగా తెలిసిన గ్రామీణ బౌద్ధ స్థలాల డాక్యుమెంటేషన్, వారసత్వ పరిరక్షణలో వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధి, స్థానిక సమాజాల భాగస్వామ్యాన్ని నిర్ధారించడంపై ఈ అకాడమీ దృష్టి సారించనుంది. రాష్ట్ర స్థాయిలో జాతీయ కట్టుబాట్లను అమలు చేయడంలో భూమి కేటాయింపు ఒక కీలక అడుగుగా భావిస్తున్నారు. ఈ సదస్సు సందర్భంగా వక్తలు గ్రామీణ బౌద్ధ స్థలాలు ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పర్యావరణ క్షీణత, నియంత్రణ పరిమితులు వంటి పెరుగుతున్న ముప్పులను ప్రస్తావించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని వెయ్యి సంవత్సరాల పురాతన తాబో మఠం అనూహ్య వర్షాలు, తేమ చొరబాటు కారణంగా తీవ్ర నష్టం చవిచూసిన ఉదాహరణను హిజ్ ఎమినెన్స్ క్యాబ్జే సెర్కాంగ్ తెన్‌షాప్ రిన్‌పోచే ప్రస్తావించారు. బౌద్ధ వారసత్వ పరిరక్షణను జాతీయ ఉద్యమంగా చూడాలని మాజీ నీతి ఆయోగ్ సీఈఓ డా. అమితాబ్ కాంత్ పిలుపునిచ్చారు. స్థిరమైన, సమాజ కేంద్రిత బౌద్ధ పర్యాటక నమూనాల అవసరాన్ని ఆయన హైలైట్ చేశారు. ప్రొఫెసర్ అమరేశ్వర్ గల్లా, హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన డా. ప్రజాపతి త్రివేది వంటి వారసత్వ నిపుణులు వ్యవస్థబద్ధమైన డాక్యుమెంటేషన్, అకాడమిక్ శిక్షణ, అంతర్జాతీయ సహకారం ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. సదస్సు ముగింపులో గ్రామీణ బౌద్ధ వారసత్వాన్ని జీవంతమైన సంస్కృతిగా గుర్తించే ఎనిమిది అంశాల ఢిల్లీ డిక్లరేషన్ను ఆమోదించారు. ఈ ప్రకటనలో సమాజ భాగస్వామ్యం పెంపు, సాంకేతికత ఆధారిత డాక్యుమెంటేషన్, ప్రతిపాదిత ఆసియన్ కన్సార్షియం ద్వారా ప్రాంతీయ సహకారం, నాగార్జునకొండ అకాడమీకి సంస్థాగత మద్దతు వంటి అంశాలకు పిలుపునిచ్చారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమిని కేటాయించడంతో, నాగార్జునకొండలో ప్రతిపాదిత అకాడమీ బౌద్ధ వారసత్వ పరిరక్షణకు జాతీయ కేంద్రంగా ఎదగనుంది. ఇది ఆంధ్రప్రదేశ్‌కు తన సమృద్ధమైన బౌద్ధ చరిత్రపై నూతన దృష్టిని తీసుకురావడమే కాకుండా, వారసత్వ ఆధారిత పరిశోధన, విద్య, స్థిరమైన గ్రామీణ అభివృద్ధికి కొత్త అవకాశాలను తెరుస్తుంది.

## గురుమూర్తిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

**పామర్రు మేజర్ న్యూస్:** పామర్రు నియోజవర్గ శాసనసభ్యుని కార్యాలయంలో కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వీరంకి వెంకట గురుమూర్తిని పలువురు నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్, కాపు వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ సాయల పుష్పావతి, చేవూరు గ్రామ నీటి సంఘం అధ్యక్షులు సాయల ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ గౌడ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాంప్రసాద్, ఈడే అంజి బాబు, చాట్ల రమేష్ తదితరులు పాల్గొని గురుమూర్తిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



# ఏషియన్ పెయింట్స్ 'అపెక్స్ అల్టిమా ప్రొటెక్' క్యాంపెయిన్

### గ్రాండ్‌మాస్టర్లు విశ్వనాథన్ ఆనంద్, గుకేష్ దొమ్మరాజులతో..

### దక్షిణాది ఇళ్లను ఏడాది పొడవునా వేధించే కఠిన వాతావరణ పరిస్థితుల నుంచి రక్షణ




**విజయవాడ, డిసెంబర్ 5, మేజర్ న్యూస్ :** వాతావరణ పరిస్థితులు ఏడాది పొడవునా ఇళ్లను సవాలు చేస్తున్న సమయంలో ఏషియన్ పెయింట్స్ తన కొత్త 'అపెక్స్ అల్టిమా ప్రొటెక్' క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. భారతదేశపు చెస్ దిగ్గజాలు విశ్వనాథన్ ఆనంద్, గుకేష్ దొమ్మరాజులతో కూడిన ఈ బ్రాండ్ సైన్స్, వ్యూహం, కథ చెప్పడంలో మిళితం చేసి దాని తాజా పురోగతిని హైలైట్ చేస్తుంది. గ్రాఫేన్ శక్తితో కూడిన ఇది మూడు అంశాలను వినూత్నంగా పరిచయం చేస్తోంది. ఈ కొత్త యాడ్ ఫిల్మ్‌లో ఆనంద్, గుకేశ్ ఇద్దరూ సరదాగా మేధస్సుతో కూడిన చెస్ పోరులో కనిపిస్తారు. వీరి సంభాషణ ద్వారా గ్రాఫిన్ టెక్నాలజీతో శక్తివంతమైన అపెక్స్ అల్టిమా ప్రొటెక్ ఎలా గ్రాండ్ మాస్టర్ ఆఫ్ టఫ్ ప్రొటెక్షన్ పని చేస్తుందో చూపిస్తున్నారు. ఎలా ఒక గ్రాండ్‌మాస్టర్ ముందుగానే ప్రతి అడుగును అంచనా వేసి గెలుస్తాడో, అదే విధంగా అపెక్స్ అల్టిమా ప్రొటెక్ కూడా కఠినమైన వాతావరణ మార్పులను ముందే అంచనా వేసి ఇళ్లను బలంగా రక్షించడానికి రూపొందించబడింది. ఈ పెయింట్ వాడిన గృహ యజమానులకు నిరంతర రక్షణ, నమ్మకం, దీర్ఘకాలం భరోసా లభిస్తాయి. 'గ్రాఫిన్' ఆధునిక శాస్త్రంలో అత్యంత బలమైన, వైవిధ్యమైన పదార్థాల్లో ఒకటి. ఈ ఉత్పత్తి లామినేషన్ సిస్టమ్‌ను మరింత దృఢంగా చేస్తోంది. దీంతో అపెక్స్ అల్టిమా ప్రొటెక్ట్ దక్షిణ భారత ఇళ్లకు బాహ్య గోడల రక్షణలో కొత్త ప్రమాణాలు సృష్టించింది. 12 సంవత్సరాల పని తీరు వారంటీతో వచ్చే ఈ పెయింట్ వర్షం, ఎండ, తేమ, ధూళి వంటి కఠిన వాతావరణ పరిస్థితులకు అత్యుత్తమ ప్రతిఘటనను అందిస్తుంది. ఈ ప్రచారం చెస్‌లో రక్షణ కోసం అవసరమైన వ్యూహాత్మక మేధస్సును దక్షిణ భారత ఇళ్లకు అవసరమైన తెలివైన రక్షణతో పోలుస్తూ చూపిస్తుంది. భారీ వర్షాలు, మండే వేసవి, ధూళి ఎక్కువగా ఉండే వాతావరణం ఇవన్నీ దక్షిణ భారత రాష్ట్రాల్లో బాహ్య గోడలకు అసాధారణ కఠినతర పరిస్థితులను సృష్టిస్తాయి. అందుకే ఇలాంటి వాతావరణాన్ని తట్టుకునేలా ప్రత్యేకంగా ఇంజనీరింగ్ చేయబడిన పరిష్కారాలు అవసరం. ఈ సందర్భంగా ఏషియన్ పెయింట్స్ ఎండీ, సీఈఓ అమిత్ సింగల్ మాట్లాడుతూ ఆవిష్కరణ అనేది ఏషియన్ పెయింట్స్‌లో మనం రూపొందించే ప్రతి ఉత్పత్తికి మూలమన్నారు. గ్రాఫిన్ ఆధారిత రక్షణ వైపు అడుగు వేయడం, ఎక్స్‌టీరియర్స్ విభాగంలో ఒక పెద్ద ముందడుగు అన్నారు. దక్షిణ భారత తీర ప్రాంత వాతావరణం అత్యాధునిక శాస్త్రంపై ఆధారపడిన పరిష్కారాలను కోరుకుంటుందని పేర్కొన్నారు. గ్రాఫిన్, ఎక్స్‌టీరియర్ పెయింట్స్‌లో ఇప్పటివరకు లేని కఠినత్వం, మన్నికను అందిస్తుందన్నారు. గ్రాఫిన్‌తో శక్తివంతమైన అపెక్స్ అల్టిమా ప్రొటెక్ ఈ విప్లవాత్మక మార్పును ప్రతిబింబిస్తుందని తెలిపారు. విశ్వనాథన్ ఆనంద్, గుకేష్ దొమ్మరాజులు ఈ క్యాంపెయిన్‌లో చెస్ బోర్డు నుంచి మీ ఇల్లు గోడల వరకు 'స్ట్రాటజిక్, ఇంటెలిజెంట్ డిఫెన్స్' అనే ఆలోచనకు ప్రాణం పోసే విధంగా కాన్సెప్ట్‌ను రూపొందించామన్నారు. పర్ఫెక్ట్ మూవ్‌ను సృష్టించేందుకు ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లు ఒకే వేదికపైకి వచ్చినట్లు ఈ కమ్యూనికేషన్ సూచిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఒగిల్వీ ఇండియా చీఫ్ క్లయింట్ ఆఫీసర్ బీ రామనాథన్ మాట్లాడుతూ ఈ ప్రచారంలో విశ్వనాథన్, గుకేశ్ చెస్ ఆటలోనూ, ఇళ్ల రక్షణలోనూ 'డిఫెన్స్' ఎంత ముఖ్యమో చెప్పిన తీరు చాలా బలంగా పని చేస్తోందన్నారు. వీరి కెమిస్ట్రీ గ్రాఫిన్ శక్తిని సులభంగా, ఆకర్షణీయంగా చూపిస్తుందన్నారు. దీంతో ఏషియన్ పెయింట్స్ అపెక్స్ అల్టిమా ప్రొటెక్ నిజమైన గ్రాండ్‌మాస్టర్ ఆఫ్ హోం ప్రొటెక్షన్గా నిలుస్తుందన్నారు. ఈ ప్రచారంతో ఏషియన్ పెయింట్స్ ప్రపంచ స్థాయి సాంకేతికతను మన సంస్కృతికి అనుసంధానమైన కథనంతో మిళితం చేస్తూ దక్షిణ భారత ఇళ్ల కోసం అత్యంత బలమైన, తెలివైన రక్షణను అందించే దిశగా తమ నూతన ఆవిష్కరణలను మరింత విస్తరించిందని తెలిపారు.



## ఫ్యాషన్‌లో కొత్త విప్లవాన్ని సృష్టిస్తున్న బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్

**గుంటూరు, మేజర్ న్యూస్ :** ఫ్యాషన్ కళకు తెలిసిన పద్ధతులను అధిగమించి ఒక కొత్త అమోఘమైన కథను సమర్పిస్తూ బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ ఈ సంవత్సరం ఎడిషన్ ను ముగించింది. దిగ్గజపు హౌరా బ్రిడ్జి నాటకీయమైన నేపథ్యంలో, నగర చారిత్రాత్మక హుగ్లీ నదిని అద్భుతమైన రన్ వేగా మార్చే ఈ ముగింపు ఎడిషన్ డిజైనర్ అనామిక ఖన్నా ఏకేచే ప్రయోగాత్మకమైన కలక్షన్‌ను ప్రదర్శించింది. ఆకర్షణీయమైన ఇషాన్ ఖట్టర్ ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణతో ఇది సంప్రదాయాన్ని అధిగమించి డిజైన్ ను ముందుకు తీసుకువెళ్లి, ఫ్యాషన్‌ను తదుపరి యుగంలోకి తీసుకువెళ్లింది. ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో, ఈ ప్రదర్శన కళా పనితనం దీర్ఘకాల భావనలను సవాలు చేసింది. దానిని స్థిరమైన సంప్రదాయంగా కాకుండా సజీవమైన, అభివృద్ధికరమైన పరిమాణంగా పరిగణిస్తుంది.

## కేఎఫ్‌సీ ఎపిక్ ఫీస్ట్‌తో మరింత క్రిస్పీగా సంవత్సరాంతపు వేడుకలు




**విజయవాడ, మేజర్ న్యూస్ :** సంవత్సరాంతపు వేడుకలు ఇప్పుడు మరింత అద్భుతంగా, క్రిస్పీగా, ఫింగర్ లికింగ్ అంత రుచికరంగా మారాయి. ఈ వేడుకల కోసం కేఎఫ్‌సీ ఒక ఎపిక్ ఫీస్ట్‌ను తీసుకువస్తోంది. చికెన్ ప్రియులు తమకు ఇష్టమైన సిగ్నేచర్ హాట్, క్రిస్పీ చికెన్, జ్యుసి బోన్‌లెస్ చికెన్ స్ట్రిప్స్, ఫ్రైస్, చల్లని పెప్సీ, వివిధ రకాల రుచికరమైన డిప్‌లను ఆస్వాదించవచ్చు. కేవలం రూ.799 నుంచి ప్రారంభమయ్యే ధరతో, ఈ ఎపిక్ ఫీస్ట్ ఆఫర్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ %డ% తెలంగాణ, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, కర్ణాటకతో సహా భారతదేశంలోని ఎంపిక చేసిన మార్కెట్లలో, డైన్-ఇన్, టేక్‌అవే కోసం కేవలం 4 జనవరి 2026 వరకు మాత్రమే అందుబాటులో ఉంది. కేఎఫ్‌సీ అభిమానులు వేచి ఉండకుండా, నేరుగా ఫింగర్ లికింగ్ అంత రుచికరమైన ఆహారాన్ని పొందేందుకు, డైన్-ఇన్ చేసేటప్పుడు కేఎఫ్‌సీ యాప్‌లో ప్రీ-ఆర్డర్ కూడా చేయవచ్చు.

## కాలిఫోర్నియా బాదంతో క్రిస్మస్ వేళ ప్రతి క్షణాన్ని ప్రత్యేకంగా చేసుకోండి




**విజయవాడ, మేజర్ న్యూస్ :** క్రిస్మస్ పండుగ సమీపిస్తోంది. తనతో పాటుగా ఉత్సాహం, ఆహ్లాదం, పండుగ ఆనంద వాగ్దానాన్ని తెస్తుంది. ఈ సంవత్సరం, మీ హాలీడే భోజనాలను సమున్నతం చేసుకోండి, కాలిఫోర్నియా బాదం ఆరోగ్యకరమైన మంచితనంతో బహుమతి సంప్రదాయాలను కొనసాగించండి. సహజ సిద్దమైన 15 ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉన్న ఇవి గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తూ, శాశ్వత శక్తిని అందిస్తాయి. ఆకలి నియంత్రణలో సహాయపడతాయి. సమావేశాలు, విస్తృతమైన భోజనం, ప్రయాణాలతో నిండిన నెలలో బాదం అత్యంత విలువైనదని పోషకాహార, వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి వివరించారు కాలిఫోర్నియా బాదం గింజలు తన ప్రతి వంటలో ప్రముఖంగా కనిపిస్తాయని, అవి అందించే రుచి పరంగా మాత్రమే కాకుండా మన ఆరోగ్యానికి వాటి ప్రయోజనాల కోసం కూడా అవి ముఖ్యమైనవని అన్నారు. ఒక గుప్పెడు బాదం గింజలతో రోజును ప్రారంభించడం కూడా గుర్తించదగిన ప్రభావాన్ని చూపుతుందని బాలీవుడ్ స్టార్ సోహా అలీ ఖాన్ తెలిపారు.



## విజ్ఞాన్ స్కూల్‌లో ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు

**జగ్గయ్యపేట: డిసెంబర్ 23 మేజర్ న్యూస్ :** విజ్ఞాన్ హై స్కూల్‌లో సెమి క్రిస్టమస్ వేడుకలు మంగళవారం అత్యంత ఘనంగా, కన్నుల పండుగగా జరిగినాయి. ముఖ్య అతిథి గా స్థానిక కాకాని నగర్ ఎల్ ఇ ఎఫ్ పాస్టర్ కె. శ్యాంసన్ హాజరైనారు. దైవజనులు విద్యార్థుల ఉద్దేశించి ప్రసంగిస్తూ యేసు తనను తాను తగ్గించుకొని మానవ రూపంలో జన్మించి, లోక రక్షణ కోసం మనుషుల పాపములను క్షమించినది తెలియజెప్పారు. యేసు ప్రేమ, దయ, కరుణ కు ప్రతిరూపమని, యేసు చూపిన జీవిత విధానాన్ని అవలంబిస్తూ జీవితం సాగించినపుడే మనం క్రైస్తవులుగా పిలవబడతామని, ఎదుటి వారిని ప్రేమించటమే క్రైస్తవత్వం అని, ప్రపంచం యావత్తు ఘనంగా జరుపుకొనే పండుగ క్రిస్మస్ అని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జగ్గయ్యపేట ఇన్చార్జ్, స్కూల్ సెక్రటరీ తన్నీరు నాగేశ్వరరావ్ పాల్గొని విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ తమ పాఠశాలలో అన్ని మతాల పండుగలకు సమాన ప్రాధాన్యమిస్తూ వేడుకలు నిర్వహిస్తామని, ప్రపంచంలో అందరూ జరుపుకునే పండుగ క్రిస్మస్ అని, ఈ సందర్భంగా విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన మరియ మాత, క్రిస్మస్ తాతలు, దేవదూతలు, గొర్రెల కాపరులు వేషదారణలు, క్రైస్తవ భక్తి గీతాల సాంస్కృతిక కార్యక్రమాలు బాగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలెక్స్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో వైభవంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**పామర్రు మేజర్ న్యూస్:** మండల మండల పరిధిలోని ఉరుటూరు శివారు నల్లగుంటలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో "సెమీ క్రిస్మస్" వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ముందుగా ఆయనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నృత్యాంశాలను ప్రదర్శించి అతిథుల ప్రశంసలు అందుకున్నారు. ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ ప్రస్తుతం బాల్య దశలో ఉన్న విద్యార్థులు దేవునిపై నమ్మకంతో ఉండాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ ఎక్కువ మంది జరుపుకునే పండుగ ఈ క్రిస్మస్ అని పేర్కొన్నారు. అటువంటి పండుగకు ముందుగా జరిపే సెమీ క్రిస్మస్ వేడుకలలో పాఠశాల విద్యార్థులతో కలిసి పాల్గొనడం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జున్ను శోభన్ బాబు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**పామర్రు మేజర్ న్యూస్:** పామర్రులో ఉన్న శ్రీ శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం హైస్కూలు ప్రాంగణంలో సెమీ క్రిస్మస్ వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా పాస్టర్ రాజేష్ హాజరై దేవుని వాక్య సందేశాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రేమ, క్షమ, సేవ అనే క్రిస్మస్ యొక్క అసలైన సందేశాన్ని విద్యార్థులకి వివరించి, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ శ్రీనివాస విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, డైరెక్టర్ పరుచూరి నీలిమ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. పాఠశాల ప్రిన్సిపాల్ బి.ఏసు నాయక్ మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు విద్యార్థుల్లో నైతిక విలువలు, ప్రేమాభిమానాలను పెంపొందిస్తాయని తెలిపారు. తొలుత శ్రీనివాసరావు– నీలిమ దంపతులతో పాస్టర్ రాజేష్ కేక్ కట్ చేయించారు. ఈ వేడుకలలో విద్యార్థినీవిద్యార్థులు ప్రదర్శించిన క్రిస్మస్ పాటలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్యాల ద్వారా క్రిస్మస్ సందేశాన్ని చక్కగా ఆవిష్కరించారు. కాగా ఈ సెమీ క్రిస్మస్ వేడుకలు ఆధ్యాత్మికతతో పాటు ఆనందాన్ని నింపి, విద్యార్థులకు మధుర జ్ఞాపకంగా నిలిచాయి.

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది





### విమానాశ్రయ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

### ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

**గన్నవరం, డిసెంబర్ 23, మేజర్ న్యూస్ :** విశ్వవ్యాప్తంగా ఎక్కువమంది ప్రజలు జరుపుకునే క్రిస్మస్, సెమిక్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. సోమవారం గన్నవరం మండలం దావాజీగూడెం లోని ఎస్సీ కాలనీలో గల సీఎస్ఐ చర్చ్ 28వ వార్షికోత్సవం, సెమిక్రిస్మస్ వేడుకలు నిర్వహించగా ఈ కార్యక్రమానికి యార్లగడ్డ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చర్చ్ పాస్టర్ కాటుమాల నతానియల్ బాబురావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రభువు దీవెనలు అందజేశారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసిన యార్లగడ్డ మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి, ప్రేమ, సేవ అనే విలువలను ఏసు ప్రభువు తన సందేశం ద్వారా అందించారని గుర్తు చేశారు. ఎన్నో క్రైస్తవ సంస్థలు మనదేశంలో సమాజ సేవలో పాల్గొంటున్నాయని, నిరక్షరాస్యత నిర్మూలనలోనూ క్రైస్తవ సంస్థల కృషి స్లాఘనీయమన్నారు. దావాజిగూడెం గ్రామంలో ఎయిర్పోర్ట్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ భూములు ఇచ్చిన రైతులకు కౌలు సమస్య ఉందని వారం పది రోజుల్లో ఆ సమస్య పరిష్కారం అవుతుంది అని హామీ ఇచ్చారు.

దావాజీగూడెం ఉన్నత పాఠశాలలో స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా ఇప్పటికే శాప్ చైర్మన్ ను కోరానని, త్వరలో స్టేడియం నిర్మాణం సాకారం అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ లోగా మండల పరిషత్, గ్రామపంచాయతీ నిధులతో క్రికెట్ బాక్స్ ఏర్పాటు చేయాలని యార్లగడ్డ ఆదేశించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు గొంది శివకోటేశ్వరావు 300 మంది మహిళలకు ఎమ్మెల్యే యార్లగడ్డ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, టిడిపి నాయకులు గొంది నరేంద్ర, కొసరాజు రాము, మద్దినేని వెంకటేశ్వరరావు, బడుగు ఝాన్సీ, కారంపూడి సాంబయ్య, కారంపూడి కుమార్, సుకన్య, బోడపాటి రవి, బొప్పిడి ప్రవీణ్, ధర్మారావు, తిరువీధి సుబ్బారావు తిరువీధి సురేష్, పండు బాబు, దొరబాబు, తిరువీధి ఫణీంద్ర, అశోక్, పులి రవి, జనసేన నాయకులు చిమటా రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.



## పెదపారుపూడిలో సెమీ క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల కేంద్ర మైన పెదపారుపూడి గ్రామంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన చప్పిడి కిషోర్ రైస్ మిల్ ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా ముందుగా చేసి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఎమ్మెల్యే కుమార్ రాజా చేతులమీదుగా నిర్వాహకులు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చప్పిడి సమీర, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు లతోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంఘ విశ్వాసులు, క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**చల్లపల్లి మేజర్ న్యూస్:** శ్రీ వివేకానంద డిగ్రీ కాలేజ్, విజయ జూనియర్ కాలేజీల సంయుక్త ఆధ్వర్యంలో 23వ తేదీ మంగళవారం సాయంత్రం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇండియన్ విలేజ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు డాక్టర్ వేములపల్లి సురేష్ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ అందరితో ప్రేమగా ఉంటూ దయ జాలి కలిగి ఉండడమే నిజమైన క్రిస్మస్ అని అదే దేవుని రాజ్యమని తెలియచేశారు. డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్ బాబు మాట్లాడుతూ సమాజంలో దయ జాలి కలిగి ఉండి అందరితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, క్రిస్మస్ తాత వేషధారణ విద్యార్థులను అలరించాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కళాశాలల సెక్రటరీ కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ రహీం, అధ్యాపక బృందం కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**జగ్గయ్యపేట డిసెంబర్ 23, మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఐదవ వార్డు వైవై కాలనీలో ఉన్న దైవ స్వరూపి ప్రార్థన మందిరంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో కౌన్సిలర్ వట్టెం మనోహర్ పాల్గొని ప్రభువు వాక్యమును గైకొని ఉండాలని అన్నారు. కొంత కాల క్రితం మనోహర్ వేలంగినికు వెళ్లి మరియమాతను దర్శించుకుని వారి అనుభవాలను దైవ స్వరూపి మందిర విశ్వాసులతో పంచుకున్నారు. పాస్టర్లకు, స్థానిక ప్రజలకు నూతన సంవత్సర క్రిస్మస్ క్యాలెండర్లు జగ్గయ్యపేట వైఎస్ఆర్సిపి మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ ఏసుప్రభు యొక్క ఆశీస్సులు మన ప్రాంత ప్రజలకు రాష్ట్రంలోని ప్రజలందరికీ సుఖసంతోషాలతో ఉండే విధంగా చూడాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్టు ఈ సభా ప్రాంగణానికి ఈ వేడుకలకు విచ్చేసినటువంటి ప్రతి ఒక్క కుటుంబ సభ్యులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉన్నానని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్స్ సంఘ సభ్యులు, సండే స్కూల్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ రైతు దినోత్సవ వేడుకలు




**జగ్గయ్యపేట, డిసెంబర్ 23, మేజర్ న్యూస్:** మండలంలో కృషి విజ్ఞాన కేంద్రం గరికపాడులో ఘనంగా జాతీయ రైతు దినోత్సవ కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను, రైతుల అభ్యున్నత, వ్యవసాయ కూలీల జీవనోపాధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న జి రామ్ జి కార్యక్రమం యొక్క గురించి ఆవశ్యకత రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం, గరికపాడు శాస్త్రవేత్త అయినటువంటి వ్యవసాయంలో చౌదరి చరణ్ సింగ్ చేసిన కృషి, వివిధ సంస్కరణల గురించి రైతులకు వివరించారు. తదుపరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రబీ వివిధ పంటలో ఈ కాలంలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో చౌదరి చరణ్ సింగ్ కి రైతులు, శాస్త్రవేత్తలు పూలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్. ఎం. రవి కిషోర్, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. బి. వెంకటేశ్వర్లు, ఏం.రామ కోటేశ్వరరావు ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ మండలాలలో ఆదర్శ రైతులు వ్యవసాయంలో వారు చేపట్టిన కృషికి సన్మానించడం జరిగింది.

# అక్షయ పాత్ర ఫౌండేషన్ మధ్యాహ్న భోజన వంటశాల నిర్మాణం చేపట్టడం ఒక బృహత్తర కార్యక్రమం





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** అక్షయ పాత్ర ఫౌండేషన్ మధ్యాహ్న భోజన వంటశాల నిర్మాణం చేపట్టడం ఒక బృహత్తర కార్యక్రమం అని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం గుడివాడలో స్థల దాత వి కే ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య భూ విరాళం ఇచ్చిన 1.50 ఎకరాల స్థలంలో అక్షయపాత్ర ఫౌండేషన్ వారు ప్రవాస భారతీయులు వర్ణ పువ్వాడ ఆర్థిక సహాయంతో నిర్మిస్తున్న కేంద్రీకృత మధ్యాహ్న భోజన వంటశాల భూమి పూజా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాముతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్షయపాత్ర ఫౌండేషన్ వారు ఇప్పటికే పాఠశాలలకు, అన్న క్యాంటీన్లకు ఎంతో అత్యుత్తమ ప్రమాణాలతో నాణ్యత గల ఆహారాన్ని సరఫరా చేస్తోందని ప్రశంసించారు. వారు గుడివాడ చుట్టు పక్కల ఉన్న పాఠశాలలకు మధ్యాహ్న భోజనం సరఫరా చేయుటకు సొంతంగా వంటశాల నిర్మించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అందుకు స్థలదాత కోదండరామయ్య, వంటశాల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్న వర్ణ పువ్వాడలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము మాట్లాడుతూ అక్షయపాత్ర ఫౌండేషన్ విలువలు ఉన్న ఒక గొప్ప సంస్థని వారు వంటశాల నిర్మాణం చేపట్టడం ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. అతి తక్కువ ధరకు అత్యంత శుభ్రమైన నాణ్యమైన ఆహారం అందించడం అక్షయపాత్ర ఫౌండేషన్ వారి ప్రత్యేకత అన్నారు. అందుకే సీఎం నారా చంద్రబాబు నాయుడు వారి ద్వారా కావలసిన వారికి ఆహారం సమకూరుస్తున్నారన్నారు. గుడివాడలో వంటశాల నిర్మాణం చేపట్టడం అందుకు స్థలం ఇచ్చిన కోదండరామయ్య, అమెరికాలో ఉంటూ జన్మభూమి గుడివాడను మరిచిపోకుండా వంటశాల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్న వర్ణ పువ్వాడ ఎంతో అభినందనీయులు అన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షులు వంశీధర దాస మాట్లాడుతూ వంటశాల నిర్మాణం ఒక అద్భుతమైన కార్యక్రమం అన్నారు. ఫౌండేషన్ ద్వారా భారతదేశంలో 23 లక్షల మంది ప్రజలకు ప్రతిరోజు మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో అనుసంధానమై మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నామన్నారు. స్థానికులు కోదండరామయ్య స్థలం ఇచ్చినందుకు, అమెరికా వాసి వర్ణ పువ్వాడ వంటశాల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. గుడివాడ చుట్టూ ఉన్న 150 పాఠశాలల్లో చదువుకుంటున్న 10 వేల మంది పిల్లలకు ప్రతిరోజు మధ్యాహ్న భోజనం అందించే విధంగా వంటశాల నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అక్షయపాత్ర ఫౌండేషన్ పిఆర్ రఘునందన దాస, స్థల దాత కోదండరామయ్య వంటశాల దాత వర్ణ పువ్వాడ, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ ఆర్డిఓ జి.బాలసుబ్రహ్మణ్యం, ప్రఖ్యాత రైస్ మిల్లర్ వీరయ్య చౌదరి, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు తుమ్మూడి సాంబశివరావు, కృష్ణాజిల్లా పల్సస్ సంఘం అధ్యక్షులు టంగుటూరి శ్రీనివాసు, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాటూరు రంగనాథ్ పలువురు ప్రజలు పాల్గొన్నారు.

# నైతిక విలువలతోనే యువతకు బంగారు భవిష్యత్

## శాయన సంధ్య సన్మాన సభలో వక్తలు

మచిలీపట్నం మేజర్ న్యూస్ : నైతిక విలువలతోనే యువతకు బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. శాయన వీరభద్రయ్య- వీర రాఘవమ్మ సేవా సమితి అధినేత రిటైర్డ్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శాయన సుశీల రావు కుమార్తె శాయన సంధ్య అమెరికా డెలాస్ సన్మాన కార్యక్రమం మంగళవారం ఉదయం మచిలీపట్నంలోని ఆర్కే కళాశాలలో ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్కే కళాశాల అధినేత డీసీఎంఎస్ చైర్మన్ జనసేన పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, ఇతరులకు సాయం చేస్తే కలిగే సంతృప్తిని మించినది జీవితంలో మరేదీ లేదన్నారు. ఇతరులకు సాయం చేయాలనే తత్వం మనిషికి వున్న గుణాలలో అన్నిటికంటే గొప్ప గుణమన్నారు విద్యార్థులు చదువుతోపాటు సాయం చేసే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగినా తండ్రి ఆశయాలకు అనుగుణంగా పేద విద్యార్థులకు సాయం చేసేందుకు ముందుకు వచ్చిన శాయన సంధ్య మహిళా సమాజానికి ఆదర్శవంతంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ న్యాయవాది మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచి నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. మంచి పనులు పట్ల శ్రద్ధ వహిస్తూ చెడును విస్మరిస్తూ భవిష్యత్తుకు బంగారు



బాటలు వేసుకోవాలన్నారు.

చిన్నతనం నుంచి క్రమశిక్షణతో పెరిగి అమెరికాలో ఉన్నత శిఖరంలో ఉన్న శాయన సంధ్య నేటి బాలికలకు ఆదర్శం కావాలన్నారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు సాయం చేస్తున్న సాయన సుశీలరావు ఆశయాలకు అనుగుణంగా ఆయన కుమార్తె సంధ్య సహకరించడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. గత కొన్నేళ్ళుగా ప్రతినెలా ఇరువురు ప్రతిభ గల పేద విద్యార్థులకు ప్రోత్సహక నగదు బహుమతులు అందిస్తున్న సుశీలరావుకు తన వంతుగా ఆర్థిక తోడ్పాటు అందిస్తున్న సంధ్య గొప్ప గుణవంతురాలు అన్నారు. ఆమె చేతుల మీద ఈరోజు మచిలీపట్నం ఆర్కే కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి పి వెంకట రమణకు అలాగే విజయనగరంలో బీటెక్ చదువుతున్న మచిలీపట్నంకు చెందిన విద్యార్థిని ఆరేపి వాసవికి తలో అయిదు వేల రూపాయలు చొప్పున నగదు బహుమతులు అందించడం హర్షణీయమ న్నారు. సన్మాన గ్రహీత శాయన సంధ్య మాట్లాడుతూ అన్నిటికంటే చదువు మనిషికి మంచి పవర్ లాంటిదన్నారు. చదువు అనే పవర్ వుంటే అది మనిషి ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మంచి చదువు జీవితంలో రాణించడానికి అనుకున్నది సాధించడానికి దోహదపడుతుందన్నారు.

ఏ బ్యాక్ గ్రౌండ్ లేకపోయినా చదువు అనే బ్యాగ్రౌండ్ ఉంటే వారి ఎదుగుదలను ఎవరు ఆపలేరన్నారు. విద్యార్థుల దగ్గర ఎడ్యుకేషన్ అనే పవర్ ఉంటే వారికి మరే బ్యాగ్రౌండ్ అవసరం లేదన్నారు. ఎడ్యుకేషన్ బ్యాక్ గ్రౌండ్ ఒకటే మనిషి సక్రమంగా ఎదగడానికి దోహదపడుతుందన్నారు. అందుకనుగుణంగా విద్యార్థులు తమవ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. మంచి పుస్తకాలు చదవడం మంచి భావాలను అలవరచుకోవడం ద్వారా అది సాధ్యపడుతుందన్నారు. మీరంతా బాగా చదవాలని మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని ఈ సందర్భంగా సంధ్య ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాయన సుశీల రావు,సచాయ్ హోటల్ అధినేత బండి సత్యనారాయణ, ఆర్కే కళాశాల ప్రిన్సిపాల్ శివరామకృష్ణ, సీనియర్ జర్నలిస్టు కె వి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్తలను అన్ని రకాల అనుమతులు మంజూరు చేసి ప్రోత్సహించాలి






మచిలీపట్నం మేజర్ న్యూస్ : జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఏలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల అనుమతులు మంజూరు చేసి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని మీకోసం సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల, పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశం నిర్వహించి వివిధ అంశాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సింగిల్ డెస్క్ పాలసీ కింద పరిశ్రమలు నెలకొల్పేందుకు 1496 దరఖాస్తులు రాగా అందులో 1217 ఆమోదించారని ఒకటే తిరస్కరించారని, ఇంకనూ 278 దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. అందులో ప్రధానంగా తూనికలు కొలతల శాఖలో అత్యధికంగా 245 ఉన్నాయని, కాలుష్య నియంత్రణ మండలి లో 16, ఉన్నాయని, ఏపీఐఐసీలో 9 ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించి అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పీఎం విశ్వకర్మ పథకం కింద 2036 దరఖాస్తులు అందగా ఇప్పటివరకు 790 దరఖాస్తులకు ఆర్థిక సహాయం మంజూరు చేశారని, మిగిలిన దరఖాస్తులను కూడా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ర్యాంపు కార్యశాలల పైన కూడా ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పీఎంఈజీపి పథకం కింద ఈ సంవత్సరం 162 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు కేవలం 43 యూనిట్లకు మాత్రమే బ్యాంకులు ఆర్థిక సహాయం మంజూరు చేయడం సరైనది కాదని స్పష్టం చేస్తూ ఇకనైనా వేగవంతం చేయాలని బ్యాంకర్లకు సూచించారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన భాగస్వామ్య సదస్సులో అంగీకార ఒప్పందాలు కుదిరిన 14 కంపెనీ కు సంబంధించి పరిశ్రమలను నెలకొల్పుటకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మండలి 23 ఎం ఎస్ ఎం ఈ. పరిశ్రమలకు సంబంధించి 88.16 లక్షల రూపాయలను పెట్టుబడి రాయితీ, తిరిగి చెల్లింపు వడ్డీ రాయితీ, తిరిగి చెల్లింపు విద్యుత్తు రాయితీల కింద ప్రోత్సాహకాలను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మంజూరు చేసింది. ఈ సమావేశంలో డిఐసి జిఎం ఆర్ వెంకటరావు డిఆర్డిఏ పిడి హరినాథ్ ఏపీఐఐసీ జెడ్ ఎం బాబ్జి బీసీ కార్పొరేషన్ ఈడీ రాజేంద్ర బాబు, కాలుష్య నియంత్రణ మండలి ఈ ఈ వెంకటేశ్వరరావు జిల్లా ఉద్యాన అధికారి జె జ్యోతి, ఎల్ డి ఎం రవీంద్రారెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్ బాబు తూనికలు కొలతల తనిఖీ అధికారి ఈశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా రైతు దినోత్సవం



**మైలవరం, మేజర్ న్యూస్ :** లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద ఇద్దరు రైతులను సన్మానించి పవర్ స్ప్రేయర్లను ఏడిఏ శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ప్రోగ్రాం కన్వీనర్ జాస్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశానికి వెన్నుముక రైతు అని రైతు దినోత్సవ సందర్భంగా రైతులను సన్మానించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షులు చనుమోలు నాగభూషణం, చాంబర్ ఆఫ్ కామర్స్ మైలవరం అధ్యక్షులు చలువాది మధుసూదన్ రావు, లైన్స్ క్లబ్ సభ్యులు కొల్లి నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌ని సన్మానించిన మున్సిపల్ వైస్ చైర్మన్



**జగ్గయ్యపేట, డిసెంబర్ 23, మేజర్ న్యూస్:** పట్టణంలో జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమితులైన జనసేన పార్టీ వీర మహిళ తుడుము శైలజను జగ్గయ్యపేట మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్, పెనుగంచిప్రోలు మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి దుడ్ల వినయ్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియ చేశారు.



## పాఠశాలలను తనిఖీ చేసిన అకాడమిక్ మానిటరింగ్ బృందం

**మొవ్వ మేజర్ న్యూస్ :** విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య గల అవినాభావ సంబంధాలు, మౌలిక, భౌతిక వనరులు, విద్యార్థుల్లోపఠనాశక్తి, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలను పరిశీలించారు. దీనిలో భాగంగానే కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హై స్కూల్ కు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించారు. ఎకడమిక్ మానిటరింగ్ టీంకు ఎంఇఓ– 1 ఏ భాను ప్రకాష్, ఎంఇఓ– 2 కే. శ్రీలక్ష్మి నాయకత్వం వహించగా ప్రధానోపాధ్యాయులు వి.వి. సంజీవరావు (పెదసనగల్లు), ఎన్.ఉమాశ్రీ (మొవ్వ), ఇ. సమాధానరావు (కోసూరు),కె. అరుణ (నిడుమోలు) పర్యవేక్షణలో పాఠశాలల్లోని లెక్కలు, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, ఇంగ్లీషు, తెలుగు, హిందీ లకు చెందిన సబ్జెక్టు టీచర్స్, తరగతి గదులు, పిల్లలోగల టాలెంటును పరిశీలించి నమోదు చేశారు. పదవ తరగతి విద్యార్థులకు కొనసాగుతున్న వంద రోజులు ప్రోగ్రాం, ఆరు నుంచి తొమ్మిదవ తరగతి వరకు నిర్వహిస్తున్న విద్యాశక్తి, ఒకటి నుంచి ఐదు వరకు 75 రోజులు ప్రోగ్రాం గా నిర్వహిస్తున్న ఎఫ్ ఎల్ ఎన్ నన్ను సైతం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు మరింత మెరుగుపరచడం, అత్యుత్తమ ఫలితాలు సాధనకు ప్రభుత్వం తాజాగా ఈ సమాచారం సేకరణ కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరిశీలన కూచిపూడి హై స్కూల్ తోపాటు భట్ల పెనుమర్రు జిల్లా పరిషత్ హై స్కూల్, భట్లపెనుమర్రు, మల్లికార్జున పురం బార్లపూడి (ఏ ఏ), ఎం ఎం ఆఫ్ కూచిపూడి పాఠశాలల్లో నిర్వహించగా హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి, ఆర్ భార్గవిలు సహకరించారు.

## కూటమిలో కష్టపడి పని చేసే వారికి పదవులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో కష్టపడి పని చేసే వారికి పదవులు వరిస్తాయి అనడానికి నిదర్శనమే మచిలీపట్నం తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టు కి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన అద్దేపల్లి నిరంజన రావు ప్రత్యక్ష నిదర్శనమని, బిజెపి సీనియర్ నాయకుడు, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ లు అన్నారు. మంగళవారం ఇటీవల నూతనంగా మచిలీపట్నం 9వ అదనపు జిల్లా కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన అద్దేపల్లి నిరంజన రావును ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, పి. వి. ఫణి కుమార్ లు అభినందించి, ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, పి. వి. ఫణి కుమార్ లు మాట్లాడుతూ.క్రమశిక్షణతో పట్టుదలతో న్యాయవాద వృత్తిని ప్రారంభించిన అద్దేపల్లి నిరంజన రావు కు తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమించిన మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలసౌరి, ఆర్టీసీ చైర్మన్, కొనకళ్ళ నారాయణరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, గొర్రెపాటి గోపీచంద్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదములు తెలిపారు.అద్దేపల్లి నిరంజనరావు ప్రాసిక్యూషన్ కు మంచి పేరు తీసుకువచ్చి, కూటమి ప్రభుత్వం తనకు అప్పజెప్పిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చి నాయకులకు మంచి పేరు తీసుకురావాలని అద్దేపల్లి నిరంజన రావుకు ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, పి. వి. ఫణి కుమారులు సూచించారు.ఈ కార్యక్రమంలో రామలింగేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు, నిమ్మగడ్డ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 28న మక్కపేటలో హిందూ సమ్మేళనం

**వత్సవాయి, మేజర్ న్యూస్ :** మండలంలో మక్కపేట గ్రామంలో ఈ నెల 28న హిందూ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తిరుమలగిరి దేవస్థానం చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ తెలిపారు. మండలంలో భీమవరం గ్రామంలో హిందూ బంధువులు తో సన్నాహక సమావేశం నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా తిరుమలగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం చైర్మన్, మక్కపేట హిందూ సమ్మేళనం అధ్యక్షులు కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ మాట్లాడుతూ డిసెంబర్ 28వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు హిందూ సమ్మేళనం కార్యక్రమం మక్కపేటలోని ఎన్ కె ఆర్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ప్రముఖ స్వామిజీలు, వక్తలు పాల్గొనడం జరుగుతుందని, కావున ప్రతి కుటుంబం నుండి కులాలకు అతీతంగా ప్రతి హిందువు ఈ సమ్మేళనం పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమములో కార్యదర్శి పగడాల శ్రీనివాస్,ప్రతినిధులు చంద్రశేఖర్, తిలక్, పూర్ణ దేవ, గ్రామ హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# సాటిలేని దార్శనికుడు అటల్ బిహారీ వాజ్‌పేయి (1924-2018)

**విజయవాడ, మేజర్ న్యూస్ :** అటల్ బిహారీ వాజ్‌పేయి ఒక అరుదైన రత్నం, భారతమాత ముద్దుబిడ్డ, ఆయనకు భారతరత్న పురస్కారం లభించడం సముచితం. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం ఆయన జన్మదినమైన డిసెంబర్ 25ను సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించింది. ఈ గుర్తింపు కేవలం ప్రతీకాత్మకం కాదుబీ ఇది దేశానికి వాజ్‌పేయి చేసిన అపారమైన సేవకు నిజమైన అంగీకారం, స్వాతంత్ర్యానంతర భారతదేశపు అత్యున్నత వ్యక్తిత్వాలలో ఒకరికి సమర్పించే సామూహిక కృతజ్ఞతా భావన. జాతీయ జీవితంలోని దాదాపు ప్రతి రంగంలోనూ వాజ్‌పేయి ప్రభావం కనిపిస్తుంది. సంక్షోభాలను ఆయన చాకచక్యంగా నిర్వహించే విధానం, తరచుగా సహజమైన హాస్యం, కవితాత్మక వ్యక్తీకరణతో కూడి, ఎవరినీ నేరుగా బాధించకుండా శక్తివంతమైన సందేశాలను అందించింది. వ్యక్తిగత లేదా రాజకీయ ప్రయోజనం వాజ్‌పేయికి గిట్టని విషయంబీ ఆయన చర్యలు ఎల్లప్పుడూ జాతీయ ప్రయోజనాలచే నిర్దేశించబడ్డాయి. ఆయనను భారత రాజకీయాల భీష్మ పితామహుడిగా సరైన రీతిలో అభివర్ణించారు,, ఆయన చేసిన సేవలను ఆయన రాజకీయ ప్రత్యర్థులు కూడా గుర్తించారు. 1950ల మధ్యలో వాజ్‌పేయి తొలిసారిగా లోక్‌సభ సభ్యుడిగా ఉన్నప్పుడు, భారతదేశపు మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఆయనను "భవిష్యత్ ప్రధానమంత్రి" అని ప్రసిద్ధంగా అభివర్ణించారు. ఆనాటి దిగ్గజాల మధ్య పార్లమెంటులో ఆయన ప్రభావం అంత గొప్పగా ఉండేది, ఈ ప్రభావం ఆయన ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితమంతా కొనసాగింది. 1924లో గ్వాలియర్‌లో ఒక సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన వాజ్‌పేయి, చిన్న వయస్సులోనే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రభావానికి లోనయ్యారు, బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. స్వతహాగా కవి, అద్భుతమైన వక్త,, మృదువుగా మాట్లాడేవారైనప్పటికీ, తన భావాలను గట్టిగా వ్యక్తీకరించే సంభాషణపరుడు అయిన ఆయన, మధ్యతరగతి విలువలలో లోతుగా పాతుకుపోయారు. "తప్పు పార్టీలో సరైన వ్యక్తి" అని రెచ్చగొట్టే విమర్శలు ఎదురైనప్పటికీ, వాజ్‌పేయి తన రాజకీయ, తాత్విక విశ్వాసాల నుండి ఎప్పుడూ వెనుకాడలేదు. దేశ నాగరికత గొప్పదనానికి అనుగుణంగా ఒక ప్రత్యేకమైన రాజకీయ–సామాజిక–ఆర్థిక తత్వశాస్త్రం ద్వారా స్వాతంత్ర్యానంతర భారతదేశాన్ని ఆయన ఊహించారు. భారతదేశం విశ్వగురువుగా ఆవిర్భవించాలనే ఆలోచనను మొదట వాజ్‌పేయియే వ్యక్తం చేశారు,, ఈ దార్శనికతనే ప్రస్తుత మోడీ ప్రభుత్వం ముందుకు తీసుకువెళుతోంది. ఈ రోజు చేపట్టిన అనేక ఆర్థిక, విదేశాంగ విధాన కార్యక్రమాలకు వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న కాలంలోనే పునాదులు పడ్డాయి, ఇప్పుడు అవి సమకాలీన జాతీయ, అంతర్జాతీయ వాస్తవాలకు అనుగుణంగా మార్చబడ్డాయి. ఈ కోణంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వాజ్‌పేయి దార్శనికతను నెరవేరుస్తున్నారు, ఇది సంఘ్ నుండి ఉమ్మడి సైద్ధాంతిక అభ్యాసంలో పాతుకుపోయింది. ఆర్ఎస్ఎస్ శతాబ్ది వాజ్‌పేయి జన్మ శతాబ్దితో దగ్గరగా ఉండటం భారత చరిత్రలో అరుదైన, చారిత్రాత్మక యాదృచ్ఛికం. ప్రతిపక్ష నాయకుడిగా, కేంద్ర మంత్రిగా లేదా ప్రధాన మంత్రిగా వాజ్‌పేయి చురుకైన వ్యక్తి. స్వాతంత్ర్యం తర్వాత మొదటి మూడు దశాబ్దాలు ప్రతిపక్షంలో ఆయన నిర్మాణాత్మక పాత్ర పోషించారు. ఇందిరా గాంధీ విధించిన అత్యవసర పరిస్థితిలో ఆయన జైలు శిక్షను భరించారు, తరువాత జనతా ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా భారతదేశ విదేశాంగ సంబంధాలలో కొత్త దిశను నిర్దేశించారు. 1990ల చివరలో ప్రధానమం త్రిగా కూడా, వాజ్‌పేయి చారిత్రాత్మక లాహోర్ బస్సు యాత్ర ద్వారా పాకిస్తాన్‌కు శాంతి హస్తాన్ని అందించారు. దురదృష్టవశాత్తు, పాకిస్తాన్ అతని దూరదృష్టి గల దృక్పథాన్ని గుర్తించడంలో విఫలమైంది, బదులుగా కార్గిల్ సంఘర్షణ సమయంలో దూకుడు మార్గాన్ని ఎంచుకుంది. సంకీర్ణ రాజకీయాల్లో వాజ్‌పేయి వసతి కళను ప్రదర్శించాడు, సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించి పూర్తి పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన మొదటి ప్రధానమంత్రి అయ్యాడు. ఆయన సంకీర్ణ ధర్మ భావనను రూపొందించి ప్రాముఖ్యం పొందారు, భవిష్యత్ ప్రభుత్వాలకు ఒక ప్రమాణాన్ని ఏర్పాటు చేశారు. ఆయన నిరంతరం నిరంకుశ ధోరణులను వ్యతిరేకించారు, విభిన్న రాజకీయ అభిప్రాయాల వసతిని సమర్థించారు, తనను తాను నిజమైన సమాఖ్యవాదిగా స్థిరపరచుకున్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి వాజ్‌పేయి హృదయానికి దగ్గరగా ఉంది. నేడు కనిపించే జాతీయ రహదారి నెట్‌వర్క్ భారతదేశంలోని నాలుగు మెట్రోపాలిటన్ నగరాలను అనుసంధానించే ఆయన ప్రతిష్టాత్మక స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్టు యొక్క పొడిగింపు. దీనికి తోడు ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం గ్రామీణ అనుసంధానాన్ని మెరుగుపరిచింది. తన పదవీకాలంలో నిర్మించిన కేంద్ర నిధులతో అన్ని వాతావరణాలకు అనువైన రోడ్లు వ్యవసాయ వృద్ధికి, గ్రామీణ ఆర్థిక కార్యకలాపాలకు ఉత్ప్రేరకంగా మారాయి. వాజ్‌పేయి కొత్త టెలికాం విధానం ద్వారా టెలికమ్యూనికేషన్ విప్లవానికి నాయకత్వం వహించారు, అట్టడుగు స్థాయిలో మానవ మూలధనాన్ని బలోపేతం చేయడానికి సర్వ శిక్షా అభియాన్‌ను రూపొందించారు. ఆర్థిక బాధ్యత వాజ్‌పేయి పాలనలో మరొక ముఖ్య లక్షణం. ఎఫ్ఆర్‌బిఎం చట్టం, నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ యూనిట్ల వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ, ఆర్థిక వివేకం స్థిరమైన వృద్ధికి బలమైన పునాది వేసింది. ఈ అభివృద్ధి మార్గాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ భారత్ ఫస్ట్ తత్వశాస్త్రం కింద ముందుకు తీసుకువెళుతున్నారు. బిజెపి రాజకీయ ఆలోచనలో అంతర్భాగంగా ఉన్న, వాజ్‌పేయి ముందుకు తెచ్చిన అంత్యోదయ సూత్రాన్ని మోడీ మరింత బలోపేతం చేశారు. సంక్షేమం, అభివృద్ధి యొక్క ఈ సమతుల్య విధానం భారతదేశం ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి సహాయపడింది. వాజ్‌పేయి ఒక ప్రధాన ఏకాభిప్రాయ నిర్మాత, తన సున్నితమైన మర్యాదలు, భరోసా ఇచ్చే చిరునవ్వుతో బలమైన ప్రత్యర్థులను కూడా ఒప్పించగల సామర్థ్యం కలిగి ఉన్నారు. వాజ్‌పేయి ఎప్పుడు మాట్లాడినా, దేశం విన్నది – ఎందుకంటే ఆయన మాటలు ఎల్లప్పుడూ అర్థాన్ని కలిగి ఉంటాయి, జాతీయ ప్రయోజనాలతో దృఢంగా పాతుకుపోయాయి. ఈ రోజు, వాజ్‌పేయి వేసిన బాధ్యతాయుతమైన, దూరదృష్టి గల పరిపాలన యొక్క బలమైన పునాదులపై ఆధారపడి, భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది, దానిని సాధిస్తామనే విశ్వాసంతో ఉంది. వాజ్‌పేయి వలెనే, మోడీ ప్రభుత్వం కూడా శక్తి, శాంతి మార్గం నుండి స్ఫూర్తి పొందుతూ 'భారత్ ఫస్ట్' రాజకీయాలను అనుసరిస్తోంది. వాజ్‌పేయి యొక్క తాత్విక విలువలు, పరిపాలనా వివేకం, రాజకీయ సంకల్పం ద్వారా మార్గనిర్దేశం చేయబడిన భారతదేశం, ఆయన పూర్తి చేయని అజెండాను పూర్తి చేసి, 2047 నాటికి విశ్వగురువుగా తన సముచిత స్థానాన్ని తిరిగి పొందేందుకు సిద్ధంగా ఉంది.



**సూకల మధుకర్**
బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
(సంస్థాగత)

## మాజీ తెలుగు ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావుకు ఘనంగా నివాళులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బహుముఖ ప్రజ్ఞాశాలి,అపర చాణిక్యుడు మాజీ తెలుగు ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా మంగళవారం మచిలీపట్నం నగర కార్పొరేషన్ మెయిన్ రోడ్డు మున్సిపల్ ప్రధాన పార్కు ప్రక్కనగల ఆ మహనీయుని కాంస్య విగ్రహానికి విగ్రహ కమిటీ సభ్యులు, పలువురు పట్టణ ప్రముఖులు స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సేవలను స్మరించుకొని ఆ మహనీయుని కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ మాజీ చైర్మన్, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ మాట్లాడుతూ.. స్వర్గీయ పీవీ నరసింహారావు తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణం అన్నారు. విదేశాల్లో తాకట్టు పెట్టిన మన దేశభంగారాన్ని తిరిగి తీసుకువచ్చి దేశ ఆర్థిక పరిపుష్టికి పునాదులు వేసిన మహనీయుడు స్వర్గీయ మన ఏకైక తెలుగు ప్రధాని పీవీ నరసింహారావు అన్నారు. ప్రముఖ వైద్యులు బృందావనం ధన్వంతరి ఆచార్య మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అప్పట్లో మైనార్టీ ప్రభుత్వాన్ని తన మేధస్సుతో ఐదు సంవత్సరాలు దిగ్విజయంగా పరిపాలించి దేశ ఆర్థిక పరిస్థితికి మెరుగులు దిద్దిన మహనీయుడు అన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, స్వర్గీయ పీవీ నరసింహారావు విగ్రహ కమిటీ ప్రధాన కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ.స్వర్గీయ మాజీ ప్రధాని పివి నరసింహారావు తన సొంత భూమి 1100 ఎకరాలు దేశంలోని పేద ప్రజలకు పంపిణీ చేసిన మహనీయుడు అన్నారు.క్రమశిక్షణతో ముందుకు సాగిన స్వర్గీయ పీవీ నరసింహారావు పరిపాలన దక్షతను నేటి రాజకీయ నాయకులు, యువత స్ఫూర్తిగా తీసుకోవాలి అన్నారు. వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్, బిజెపి సీనియర్ నాయకుడు, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ.ప్రపంచ శిఖరాగ్ర మహాసభల్లో పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఆనాడే బట్టబయలు చేసిన ఘనత స్వర్గీయ పీవీ నరసింహారావు దే నన్నారు.కాశ్మీర్ సమస్యపై లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడిగా అనుభవం ఉన్న వాజ్పేయి ను యు ఎన్ ఓ కు పంపించి తన సొంత పార్టీ వారిని కాకుండా ప్రతిపక్ష పార్టీ వారిని పంపించి కాశ్మీరు సమస్యపై అనుభవం ఉన్న వాజ్పేయి ద్వారా పాకిస్తాన్ వాదాన్ని ఎండ కట్టే విధంగా ప్రతిపక్ష పార్టీని కూడా గౌరవించిన ఘనుడు స్వర్గీయ మన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అన్నారు.స్వర్గీయ మన తెలుగు ప్రధాని పీవీ నరసింహారావు జీవిత విశేషాలు భావితరాలకు తెలిసేలా చేయవలసిన బాధ్యత మనందరిపై ఉంది అన్నారు.ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్, సూరిశెట్టి హరికృష్ణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, బొద్దు నాగరాజు,ప్రముఖ న్యాయవాది, పుప్పాల ప్రసాద్, బ్రాహ్మణ సంఘం నాయకులు, ఎం. సుబ్రహ్మణ్యం,నిమ్మగడ్డ శ్రీధర్, వి ఎస్ ఎస్ ఆర్ శర్మ, బావ తరంగిణి ఎడిటర్, భవిష్య, ఆర్ వి ఎస్ మురళీధర్, లక్ష్మ పజ్జుల రామకృష్ణ, తంగిరాల మిధున వ్యాస్,గొర్తి శర్మ, కొండా ప్రసాద్ తదితరులతోపాటు విగ్రహ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పిపిపి విధానంతోనే మెడికల్ కాలేజీలు, హాస్పటల్స్ అభివృద్ది



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఇండియాలోనే బెస్ట్ పాలసీ పీపీపీ విధానం రాష్ట్రానికి తీసుకురావటం జరిగింది. జాతీయ వైద్య కమిషన్, ఆరోగ్య స్థాయి సంఘం సూచించిన పీపీపీ విధానంతోనే మెడికల్ కాలేజీలు, హాస్పటల్స్ అభివృద్ధి సాధ్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. సిద్దార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థినులకు, సీనియర్ రెసిడెంట్ మహిళా డాక్టర్లకు నిర్మించిన హాస్టల్ భవనం ప్రారంభోత్సవం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా హాజరైన రాష్ట్ర ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి కె.సత్య కుమార్ యాదవ్ తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ లక్ష్మీశా ఈ హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం హాస్టల్ మొత్తం తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఈ హాస్టల్ భవన నిర్మాణానికి 2017 లో రూ.21 కోట్ల నిధులతో శంకుస్థాపన జరిగి పనులు ప్రారంభం కాగా, 2019 తర్వాత గత ప్రభుత్వం ఈ భవన నిర్మాణానికి నిధులతో పాటు, పనులు కూడా నిలిపివేసిందన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మిగిలిన నిధులు విడుదల చేయటంతో ఈ నిర్మాణ పనులు పూర్తై చక్కటి మౌళిక సదుపాయాలతో హాస్టల్ భవనం అందుబాటులోకి రావటం జరిగిందన్నారు. ఈ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణం గా పనిచేయటంతో పాటు ప్రజల ఆరోగ్యానికి ఎన్డీయే కూటమి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ హాస్టల్ భవనం నిర్మించుకోవటానికి పదేళ్ల సమయం పట్టిందని, అభివృద్ధి విషయంలో ఇలాంటి జాప్యం వుండకూడదనే ఉద్దేశ్యంతోనే పీపీపీ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లోనూ కార్పొరేట్ వైద్యం అందేలా పీపీపీ మోడల్ రూపకల్పన చేయటం జరిగిందన్నారు. మెడికల్ కాలేజీ విద్యార్థులకు చక్కటి హాస్పటల్ ఇవ్వటంతో పాటు నాణ్యమైన వైద్య విద్యను అందించేందుకు పీపీపీ మోడల్ విధానం తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ విధానంలో గవర్నమెంట్ కు 50 శాతం కోటా వుంటుందని, రిజర్వేషన్ లో ఎలాంటి మార్పులేదని, అన్నింటికంటే ముఖ్యంగా 70 శాతం ఆయుష్మాన్ భరత్ పేషంట్స్ బెడ్స్ ఇవ్వటం జరుగుతుందన్నారు. అంతే కాదు ఈ విధానంలో రెండు సంవత్సరాల కాలంలో చక్కటి సదుపాయాలతో మెడికల్ కాలేజ్ ను నిర్మించాల్సి వుంటుందని వివరించారు. గత ప్రభుత్వం రూ.8500 కోట్లతో నాలుగేళ్లలో 17 కాలేజీలు నిర్మిస్తామని రూ.1000 కోట్లు ఖర్చు చేయగా, చాలా మెడికల్ కాలేజీల్లో రాయి కూడా వేయలేదన్నారు. ఇదే రీతిన వెళితే ఆ 17 కాలేజీలు నిర్మించాలంటే 18 ఏళ్లు పడుతుందంటూ ఏద్దేవా చేశారు. పేద విద్యార్థులు ఎక్కవ మంది వైద్య విద్యను అభ్యసించాలన్న, త్వరగా మెడికల్ కాలేజీలు, హాస్పటల్స్ నిర్మాణం జరగాలన్న పీపీపీ విధానంతోనే జరుగుతుందని వెల్లడించారు.

**సీ.ఎస్.ఆర్. నిధులకు కృషి**

ఇటీవల విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి మంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో హాస్పటల్ అధికారులు మిగిలిన బిల్డింగ్స్ పూర్తి కావటానికి రూ.80 కోట్లు నిధులు అవసరం అవుతాయని తెలిపారు. అదే విధంగా ఈ ఆసుపత్రికి అవసరమైన లినాక్ మిషన్ తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి ను రూ.2 కోట్ల 80 లక్షలు, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ను రూ. 1 కోటి 30 లక్షలు సీ.ఎస్.ఆర్ నిధుల కింద కోరటం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా ఈ ప్రభుత్వాసుపత్రిలో రోజు కి వో.పి కింద 4,200 మంది రోగులు వస్తుంటారని, ఈ హాస్పటల్ అన్ని సుదపాయాలు కల్పించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు కు విన్నవించుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ భారతదేశం లో తొలి మెడికల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ఘనత దివంగత నేత మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావుకి చెందుతుందన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో పూర్తి స్థాయి లో కాన్సర్ విభాగం ఏర్పాటు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ కళాశాల వసతిగృహం భవనం నిర్మాణం పూర్తి చేయడంలో జగన్ చేతులెత్తేశారన్నారు. 80 శాతం పూర్తయిన భవన నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం దారుణమంటూ మండిపడ్డారు. వైద్య కళాశాలలో బాలికల వసతిగృహం నిర్మాణానికి రూ. 5 కోట్లు ఇవ్వని జగన్ కి పీపీపీ విధానంలో మెడికల్ కళాశాల నిర్మాణం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.సిద్ధార్థ నర్సింగ్ కళాశాల విద్యార్థుల వసతి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. వైసీపీ నాయకుల్లాగ సంకుచిత మనస్తత్వంతో పనులు ఆపేయడం లేదంటూ...వైఎస్ తెచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని చంద్రబాబు రద్దు చేశారా?అంటూ పులివెందుల ఎమ్మెల్యే వై.ఎస్.జగన్ ను ప్రశ్నించారు. ఏ ప్రభుత్వం వచ్చినా విద్యార్థుల సంక్షేమం ముఖ్యమన్నారు. మెడికల్ కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్స్ విధానం తెచ్చింది వైసీపీ ప్రభుత్వం కాదా? అంటూ నిలదీశారు. వైసీపీ నేతలు ప్రజలు కోటి సంతకాలు చేశారంటున్నారు... సుపరిపాలన యాత్రలో 5 లక్షల మంది దాకా ప్రజలను ఇప్పటి వరకూ ప్రశ్నించా.. ఎవ్వరూ సంతకం పెట్టలేదని చెప్పారని తెలిపారు. కోటి సంతకాలు పెట్టింది ఆత్మలు, ప్రేతాత్మలు అనుకోవాలా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏ వర్గం ప్రజలు కూడా సంతకాలు చేయని మాట వాస్తవమన్నారు. వికసిత భారత్ నిర్మాణం కావాలంటే ఆరోగ్యకరమైన సమాజం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డి.ఎమ్.ఈ వెంకటేష్, సూపరిటెండెంట్ వెంకటేశ్వర రావు లతో పాటు వైద్య కళాశాల సిబ్బంది, మెడికల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

# మాజేరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



**చల్లపల్లి/అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం కొత్తమాజేరు బట్టీల వద్ద 216 జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ఇరువురు దుర్మరణం చెందారు. కారు టైరు పగిలి అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనటంతో జరిగిన ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది. అవనిగడ్డ మండలం పులిగడ్డ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిరివెళ్ల భాగ్యరాజు (24), కం ప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న చెన్ను రాఘవ (25)లు కార్యాలయం పనినిమిత్తపై మచిలీపట్నం లోని డీపీవో కార్యాలయానికి వెళ్లి తిరిగివస్తున్నారు. గుడివాడకు చెందిన లోకేశ్వర్ భార్య, రెండేళ్ల బాబుతో కలిసి కారులో మోపిదేవి గుడికి వెళ్లి తిరిగి మచిలీపట్నంమీదుగా గుడివాడకు బయలుదేరారు. మధ్యాహ్నం సమయంలో మాజేరు చెకోపోస్టు సమీపంలో కారు ముందువైపు కుడిటైరు పగిలిపోవటంతో కారు అదుపుతప్పి రోడ్డుకు కుడివైపుకు దూసుకువెళుతూ ఎదురుగా వసు బిన్న బైక్ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్పై ఉన్న ఇరువురూ ఎగిరిపడ్డారు. వారిలో భాగ్యరాజు అక్కడిక్కడే పడి మృతిచెందగా, రాఘవకు చేయి తెగిపోవటంతోపాటు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని 108 అంబులెన్స్లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ తరలిస్తుండగా మార్గమధ్యలో రాఘవ సైతం కన్నుమూశాడు.

**రెండు కుటుంబాల్లో అంతులేని విషాదం**

ఇద్దరి మృతితో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. సంఘటనా ప్రదేశంలో మృతిచెందిన సిరివెళ్ల భాగ్యరాజు స్వగ్రామం కోడూరు మండలం పిట్టల్లంక. మూడు నెలల క్రితమే వివాహమైనట్లు తెలుస్తోంది. మరో మృతుడు పులిగడ్డ గ్రామానికి చెందిన చెన్ను రాఘవ. పంచాయతీలో తాత్కాలిక పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్గా పనిచేస్తున్నాడు. రాఘవకు సైతం వివాహమైంది. భాగ్యరాజు మృతదేహాన్ని శవపరీక్ష కోసం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారులో ఎయిర్బ్యాగ్స్ ఓపెన్ కావటంతో కారు నడుపుతున్న వ్యక్తికిగానీ, కారులో ఉన్న భార్య, కుమారుడికి గాయాలవకుండా క్షేమంగా బయటపడ్డారు. చల్లపల్లి ఎస్ఐ కె.వై.దాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చలో వైజాగ్... రంగానాడును విజయవంతం చేయండి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** చరిత్రకి అందని మహా పురుషుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహన రంగా 37 వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 26 న విశాఖపట్నం,కాళీమాత గుడి,ఆర్కే బీచ్ లో జరిగే రంగానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాధా రంగా మిత్రమండలి దివి యూనిట్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్ర లో, ప్రపంచంలో ఉన్న రంగా అభిమానులు అందరూ ఒక చోట చేరి ఆయనకు ఘనమైన నివాళులు అర్పించడం జరుగుతుంది. కావున రంగా అభిమానులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చేయి చేయి కలుపుదాం రంగా ఆశయాలను ముందుకు తీసుకువెళ్దాం అనే నినాదంతో వైజాగ్ లోని ఆర్కే బీచ్ దద్దరిలేలా రంగా అభిమానులు తరలిరావాలని రాధ రంగా మిత్రమండలి, దివి యూనిట్. రాజనాల మాణిక్యాల రావు, యాసం చిట్టిబాబు, రాయపూడి వేణుగోపాల్ లు కోరారు.

## 38వసారి రక్తదానం.. యువకుడి సేవతో నిలిచిన ఓ తల్లి ప్రాణం

**హనుమాన్ జంక్షన్, మేజర్ న్యూస్ :** మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా హనుమాన్ జంక్షన్‌కు చెందిన సామాజిక కార్యకర్త పింగళి జోజిబాబు మరోసారి తన సేవా మనసును చాటుకున్నారు. గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ కోసం చేరిన ఓ మహిళకు అత్యవసరంగా B+ పాజిటివ్ రక్తం అవసరమని సమాచారం అందగానే ఎలాంటి ఆలస్యం లేకుండా ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేసి ఆమె ప్రాణాన్ని కాపాడారు. ఇప్పటికే పలుమార్లు రక్తదానం చేసిన పింగళి జోజిబాబుకు ఇది 38వసారి రక్తదానం కావడం విశేషం. ఒక ఫోన్ కాల్‌తో స్పందించి ప్రాణాలను కాపాడే సేవలో ముందుండటం ఆయనకు అలవాటుగా మారింది. ఇన్నిసార్లు రక్తదానం చేసే అవకాశం కలగడం తన అదృష్టమని అని ఆయన తెలిపారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే ఈ సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆసుపత్రి సిబ్బంది ప్రశంసించారు.

# ఆంధ్రా నుంచి తెలంగాణకు జోరుగా ఇసుక అక్రమ రవాణా

వత్సవాయి డిసెంబర్ 22 మేజర్ న్యూస్ : ఆంధ్రా నుంచి తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా జోరుగా జరుగుతోంది. ఉదయం సమయంలో ఆంధ్ర ట్రాక్టర్లతో వత్సవాయి గ్రామంలో ఇసుకను ఒకచోట డంప్ చేసుకొని రాత్రి సమయంలో తెలంగాణ ట్రాక్టర్లు ద్వారా గుట్టు చప్పుడు కాకుండా రాష్ట్ర సరిహద్దును దాటేస్తున్నారు. మండల కేంద్రమైన వత్సవాయి గ్రామం అడ్డాగా చేసుకొని రాత్రి అయితే చాలు తెలంగాణకు ట్రాక్టర్లు వరుసలు కడుతున్నాయి. వత్సవాయి తెలంగాణ రాష్ట్రానికి కూత వేటు దూరంలోనే ఉండటంతో అక్రమ ఇసుక రవాణాని చేస్తున్న ఇసుక బకాసురులు అడ్డగోలుగా దొడ్డిదారుల్లో దర్జాగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణా చేస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. మండలానికి సహజ సంపదగా ఉన్న ఇసుక లింగాల, అళ్లూరుపాడు, ఇందుగుపల్లి, కన్ని వీడు, పోలంపల్లి మొదలకు గ్రామాలకు ఆనుకుని లింగాల మున్నేరు ప్రవహిస్తూ ఉండడంతో సహజంగా దొరికే ఇసుకను పొరుగు రాష్ట్రాలకు గుట్టు చప్పుడు కాకుండా తెలంగాణ రాష్ట్రానికి ట్రాక్టర్లు ద్వారా రవాణా చేస్తున్నారు. సుమారుగా కొన్ని నెలల కాలం నుంచి ఇది జరుగుతున్నప్పటికీ అధికారులు చూసి చూడనట్టు వ్యవహారించడం గమనార్హం. వత్సవాయి నుంచి బీబీసీ కెనాల్ మీదుగా బోనకల్లు చెరువుకట్ట వరకు ట్రాక్టర్లు ఇష్టానుసారంగా తిరుగుతున్నాయి. రైతులం ఏర్పాటు చేసుకున్న రోడ్డులో అధికలోడుతో ఇసుక ట్రాక్టర్లు తిరగడం వల్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడి నడవడానికి కూడా వీలులేకుండా తయారైంది. రోడ్డుపై ట్రాక్టర్ దిగబడడంతో పంట పొలాలు నుంచి ట్రాక్టర్లు నడిపి ఆగమాగం చేశారని రైతులు పేర్కొన్నారు. పొలాన్ని నాశనం చేసిన వ్యక్తులపై గతంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు కూడా చాలా వచ్చాయి అయినా ఫలితం లేదు రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్ద పోలీసులు గస్తీ కాస్తున్న ఇసుక బకాసురులు వేరే మార్గాల నుంచి తెలంగాణకు రవాణా చేయటం జరుగుతుంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నప్పటికీ అధికార యంత్రాంగం చోద్యం చూస్తున్నది. పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారుల కళ్ళు కప్పి అక్రమార్కులు ఇసుకను యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. నాయకుల అండదండలతోనే ఇసుక రవాణా జరుగుతున్నదని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.



# నగరంలో పచ్చదనాన్ని పెంచుతున్నాం....

**ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాం : విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**







**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరంలో పచ్చదనాన్ని పెంచటంతో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాం అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర అందాన్ని పెంచేందుకు, కాలుష్యాన్ని తగ్గించే దిశగా ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంగళవారం ఉద్యానవన, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్ శాఖాధిపతులు, అధికారులు, సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలికాన్ఫరెన్స్లో బందర్ రోడ్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని, ఉద్యానవన అధికారులు ఒకవైపు సుందరీకరణలో భాగంగా మొక్కలు నాటేటప్పుడు రోడ్డుపైన మట్టిని వెంటనే పరిశుభ్రపరచాలని, ఇది కేవలం శాఖల సమన్వయంతోనే జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో ఎంజీ రోడ్డు లో గల సెంట్రల్ మీడియన్‌లో సుందరీకరణ పనులు చేపట్టారని అందులో భాగంగా వివిధ రంగుల బోగన్ విల్లా మొక్కలను పెడుతున్నారని, బెంజ్ సర్కిల్ నుండి పోలీస్ కంట్రోల్ రూమ్ వద్దున్న ఈ మీడియన్లో దాదాపు 550 వరకు రంగురంగుల బోగన్ బిల్లా పెట్టడం ద్వారా నగర అందాన్ని పెంచుతున్నామని తెలిపారు. మరోవైపు అయోధ్య నగర్‌లో గల అల్లూరి సీతారామరాజు పార్క్, ఎల్ బి ఎస్ నగర్‌లోని వికలాంగుల హాస్టల్ పార్క్, హనుమాన్ పేటలో చిత్తూరు విశ్వేశ్వరయ్య పార్క్, వెటర్నరీ కాలనీలో వెటర్నరీ కాలనీ పార్క్, రామవరప్పాడు నుండి ఏలూరు రోడ్డు వెళ్లే దారిలో పోలీస్ ఔట్ పోస్ట్ వద్ద సెంట్రల్ మీడియన్, రమేష్ హాస్పిటల్ వద్దగల నెల్సన్ మండేలా పార్క్, సితార నుండి గొల్లపూడి వెళ్ళు జంక్షన్, స్వాతి రోడ్డు, నందమూరి నగర్, కండ్రిక, నున్న, చిట్టినగర్ డివైడర్ మొదలగు ప్రాంతాలలో పచ్చదనం పెంచి కాలుష్యాన్ని తగ్గించే దిశగా అడుగులు వేస్తున్నామని కమిషనర్ అన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్ పెంచే విధంగా కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణ అందించాలంటే ప్రధానంగా మొక్కలు పెంచడమే ప్రథమ లక్ష్యంగా తీసుకున్నామని తెలిపారు. మొక్కలను పెంచడమే కాకుండా వాటిని పరిరక్షించడానికి చర్యలు తీసుకుంటున్నామని అందులో భాగంగా ప్రతిరోజు మొక్కలకు నీరు పోయటం, నగరపాలక సంస్థ తయారుచేసిన ఎరువులు వేయడం ద్వారా మొక్కలను సంరక్షించుకుంటున్నా మని అన్నారు. క్రమక్రమంగా నగరంలో పాడైపోయిన మొక్కలను తీసి హరితాన్ని పెంచి నగరాన్ని సుందరంగా ఆరోగ్యంగా చేస్తామని తెలిపారు.

# సూధాకర్ మహిత స్కూల్లో ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్





**కృష్ణలంక, మేజర్ న్యూస్:** సూధాకర్ మహిత స్కూల్లో (ఎస్ఎల్ సి) సైన్స్ ఎగ్జిబిషన్ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థి, విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ లో పలు ప్రాజెక్ట్ లైన మ్యాథ్స్ పార్క్, సమరూపత, కార్బన్ డయాక్సైడ్, నీటి శుద్ధి, భూస్వరుపాలు, వైవిద్యం ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ సూధాకర్ రెడ్డి మాట్లాడుతూ స్కూల్ సైన్స్ ఎగ్జిబిషన్ అంటే విద్యార్థులు తమ సైన్స్ ప్రాజెక్టులు, ప్రయోగాలు, నమూనాలను ప్రదర్శించే ఒక కార్యక్రమం అన్నారు. ఇది వారికి ఆచరణాత్మక జ్ఞానాన్ని అందిస్తుందని అన్నారు. సృజనాత్మకతను పెంచుతుంది, సమస్య పరిష్కార నైపుణ్యాలను మెరుగుపరుస్తుందన్నారు. దీనిలో "స్మార్ట్ సిటీ," "సౌర శక్తి," "పర్యావరణం," వంటి థీమ్స్‌తో వివిధ ప్రాజెక్టులు ఉంటాయని అన్నారు. విద్యార్థులు విజ్ఞానశాస్త్రాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి ఇది ఒక గొప్ప వేదిక అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డి.వరలక్ష్మి, డీకే సురేష్, అకడమిక కో ఆర్డినేటర్ గంగా, ఉపాధ్యాయిని, ఉపాద్యాయులు, పేరెంట్స్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# ఐనపూరు హైస్కూల్ విద్యార్థులకు క్రీడా సామాగ్రి వితరణ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాతలు క్రీడా సామాగ్రిని మంగళవారం అందజేశారు. పాఠశాల దాతల కమిటీ సభ్యులు తమ్మా రాజగోపాల్ రెడ్డి ద్వారా, దాతలు గుదిబండి నాగిరెడ్డి, భవాని దంపతుల కుమార్తెలు, పాఠశాల పూర్వ విద్యార్థులు అయిన పూజిత, సందీప్తి సోదరీమణులు 12 వేల రూపాయల విలువ కలిగిన క్రీడా సామాగ్రిని బహుకరించారు. ఈ క్రీడా సామాగ్రిని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ దూడల శివనాగ భవాని చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కోటగిరి ఫణీంద్ర లకు అందజేశారు. 10 త్రో బాల్స్, 2 డిస్కస్ త్రో లు, 1 షాట్ పుట్ తదితర క్రీడాసామాగ్రిని అందజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, దాతల కమిటీ సభ్యులు తమ్మా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడల్లో కూడా బాగా రాణించాలని సూచించారు. విద్యార్థులు ఈ క్రీడా సామాగ్రిని వినియోగించుకుని శిక్షణ పొందడం ద్వారా, క్రీడలలో ఉన్నత స్థాయికి ఎదిగి, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దూడల శివ నాగ భవాని మాట్లాడుతూ ఆటలు ఆడటం ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చని, ఆటలు మానసిక ప్రశాంతతను, చురుకుదనాన్ని పెంచుతాయని, ఆరోగ్యంగా ఉండడానికి ఎంతగానో సహకరిస్తాయని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు మాట్లాడుతూ క్రీడా సామాగ్రిని అందించిన దాతలకు పాఠశాల విద్యా కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూ దాతల దాతృత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూడేరు గ్రామ సర్పంచ్ వీర్ల నాగరాజు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.



## నూతన ఏడాది క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యే

**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** నూతన ఏడాది 2026 క్యాలెండర్ను విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు మంగళవారం ఆవిష్కరించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ అందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ దొండపాటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో క్యాలెండర్లు రూపొందించగా, ఆయన్ని ప్రత్యేకంగా అభినందించారు. స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు స్పందించిన పామర్రు గ్రామపంచాయతీ

**పామర్రు లో పడకేసిన పారిశుధ్యం లో కొంతమేరకు శుభ్రం చేసిన సిబ్బంది**

**మిగిలిన ప్రాంతాలలో పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్న స్థానికులు**







**పామర్రు మేజర్ న్యూస్ :** ఎట్టకేలకు పామర్రు గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది స్పందించారు. కొంతకాలంగా గ్రామంలో చెత్తాచెదారం ఎత్తకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఎట్టకేలకు స్పందించిన గ్రామపంచాయతీ సిబ్బంది కొన్ని ప్రాంతాలలో చెత్తను తరలించారు. ప్రధానంగా కోటిరెడ్డిపేటలో ఉన్న చెత్తను తరలించి రోడ్లను శుభ్రం చేశారు. అంతేకాక రోడ్ల పక్కన బ్లీచింగ్, సున్నం చల్లి పారిశుద్ధ్య పనులు చేశారు. అయితే పంచాయతీ పరిధిలోని ఇతర ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గ్రామపంచాయతీకి అన్ని ప్రాంతాలు ఒకటేననే విషయాన్ని పాలకవర్గం, అధికారులు గుర్తించాలని వారు కోరుతున్నారు. ఇంటి పన్ను, నీటి పన్ను వసూళ్ల విషయంలో ఉన్న శ్రద్ధ పంచాయతీ అధికారులకు పారిశుధ్యం పై లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లి గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి మెండెం జమలయ్య ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ రైతు దినోత్సవం కార్యక్రమం జరిగింది. గ్రామంలో వరి నాట్లు వేస్తున్న రైతులు రైతు కూలీల మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రం పటలు తో అనందగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు రైతులు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ దేశానికి వెన్నుముక రైతు అని నేటి యువత ఉద్యోగాలతో పాటు తమ గ్రామాల్లో పెద్దలతో పాటు వ్యవసాయంలో ప్రతి ఒక్కరూ అనుభవం పెంచుకోవలసిన అవసరం ఉందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులతో ఒక రైతుగా రైతు దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషకరమన్నారు. చిన్న సన్నకారు రైతులను ప్రోత్సహించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వ్యవసాయంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు తాడేపల్లి తెలుగుదేశం గ్రామ ఉపాధ్యక్షులు ఉప్పలపాటి వెంకట్రావు, కొసనం జ్యోజి బాబు సింహాద్రి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999